రాష్ట్రంలో రాక్షస పాలన

తల్లిని, చెల్లిని గెంటేసిన వ్యక్తి జగన్: బాలయ్య నిప్పులు



హిందూపురం, మార్చి 4: రాష్ట్రంలో రాక్షస పాలన సాగుతోందని ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ అన్నారు. పెనుకొండ మండలంలోని కియ కార్ల పరిశ్రమ వద్ద సోమవారం ఏర్పాటు చేసిన రా.. కదలిరా.. సభలో వైసీపీ నేతలపై బాలయ్య నిప్పులు చెరిగారు. ఒక్క అవకాశమని అధికారంలోకి వచ్చి రాష్ట్రాన్ని సర్వనాశనం చేశాడంటూ ధ్వజమెత్తారు. అరాచకపాలన సాగిస్తున్నాడన్నారు. సిద్ధం అని అంటున్నాడనీ, దేనికి సిద్ధమో చెప్పాలన్నారు. అప్పులు చేయడానికా, జీతాలు ఇవ్వకుండా ఉండడానికా అంటూ నిలదీశారు. తల్లిని, చెల్లిని గెంటేసిన ఘనుడు రాష్ట్ర ప్రజలకు ఏమి భరోసా ఇస్తాడన్నారు. మహిళలకు భద్రత లేకుండా పోయిందన్నారు. ఎన్టీఆర్ తెలుగు జాతి కీర్తిని ప్రపంచానికి చాటారన్నారు. కియ అంటే చంద్రబాబు గుర్తుకొస్తారన్నారు. జగన్‌ను పాతాళానికి తొక్కడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. వైసీపీ అరాచక పాలనను అంతం చేసేందుకు టీడీపీ, జనసేన కూటమి సిద్ధంగా ఉందని ఎమ్మెల్యే బాలకృష్ణ ఉద్ఘాటించారు.

ఎవరేమన్నారంటే...

జేట్యాక్స్‌కు భయపడి పరిశ్రమలు పారిపోయాయి..



కియ పరిసర ప్రాంతాల్లో అనుబంధ పరిశ్రమలు వందలాదిగా ఏర్పాటు చేయాల్సి ఉండగా.. జగన్మోహన్‌రెడ్డి ట్యాక్స్‌కు భయపడి తమిళనాడుకు పారిపోయాయి. చంద్రబాబు చొరవతో జిల్లాలో కియ ఏర్పాటైంది. గొల్లపల్లి రిజర్వాయర్‌ను నిర్మించి అపర భగీరథుడయ్యారు. పెనుకొండ నియోజకవర్గ ప్రజలు ఆర్థికాభివృద్ధి సాధించి, భూముల విలువ పెరిగింది. 50వేల ఉద్యోగాలు వచ్చాయి. చంద్రబాబుకు నియోజకవర్గ ప్రజలు ఎప్పటికీ రుణపడి ఉంటారు.

బీకే పార్థసారథి, టీడీపీ శ్రీసత్యసాయి జిల్లా అధ్యక్షుడు

అపర భగీరథుడు చంద్రబాబు నాయుడు



సూర్య, చంద్రలున్నంత వరకు పెనుకొండ నియోజకవర్గ ప్రజలు.. చంద్రబాబు నాయుడును అపర భగీరథుడిగా గుర్తుంచుకుంటారు. ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి అబద్ధం సభలు నిర్వహించి, ప్రజలను మభ్య పెడుతున్నారు. పెనుకొండ నియోజకవర్గంలో భారీ మెజార్టీతో గెలిచి, చంద్రబాబుకు గిఫ్ట్‌గా ఇస్తాం.

- సవిత, పెనుకొండ ఎమ్మెల్యే అభ్యర్థి

వైసీపీ వారి ప్యాంట్లు తడుస్తున్నాయి



టీడీపీ ఆధ్వర్యంలో రాష్ట్రంలో రా.. కదలిరా.. సభలకు వస్తున్న జనాన్ని చూసి వైసీపీ వారి ప్యాంట్లు తడుస్తున్నాయి. ప్రపంచంలోని శాడిస్టులందరికీ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి చైర్మన్. చంద్రబాబుకు, జగన్మోహన్‌రెడ్డికి నక్కకు, నాగలోకానికి ఉన్నంత తేడా ఉంది. ఎన్నికలను ప్రజలు ప్రతిష్ఠాత్మకంగా తీసుకుని, చంద్రబాబును సీఎం చేసుకోవాలి.

- పల్లె రఘునాథ రెడ్డి, మాజీ మంత్రి

20రోజుల తరువాత అసలు సినిమా చూపిస్తాం



ఐదేళ్ల వైసీపీ కాలంలో ధర్మవరం నియోజకవర్గంలో టీడీపీ కార్యకర్తలను ఇబ్బంది పెట్టారు. 20 రోజుల తరువాత అసలు సినిమా ఎలా ఉంటుందో మేం చూపిస్తాం. ధర్మవరంలో ఎద్దులబండికి సైకిల్ కట్టి ఈడ్చుకెళ్లారు. రాబోయే రోజుల్లో అదే సైకిల్‌ను ఎద్దుల బండిపై ఊరేగిస్తాం. అడ్డు వచ్చిన వారిని తొక్కుకుంటూ ముందుకెళ్తాం.

- పరిటాల శ్రీరామ్, టీడీపీ ధర్మవరం నియోజకవర్గ ఇన్‌చార్జి

జనచంద్రం



రా.. కదలిరా సభకు హాజరైన భారీ జనం



చంద్రబాబు అభివాదం

వివరాలు 5, మెయిన్‌లో..

రా.. కదలిరా.. సభకు భారీ జనం... పోటెత్తిన అభిమానం

పెనుకొండ జనకొండగా మారిపోయింది. దేశానికే ల్యాండ్‌మార్క్ అయిన కియ పరిశ్రమ ముందువైపున జనసంద్రం కొలువుదీరింది. టీడీపీ అధినేత నారా చంద్రబాబునాయుడు తలపెట్టిన రా.. కదలిరా.. సభకు జనం తండోపతండాలుగా తరలివచ్చారు. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా వేలాదిగా పార్టీ శ్రేణులు, అభిమానులు, జనం తరలివచ్చారు. చంద్రబాబును చూడగానే అభిమానం ఉప్పొంగింది. కేరింతలతో ఘన స్వాగతం పలికారు. చంద్రబాబు ప్రసంగిస్తున్నంతసేపు హాజరైన వారు ఈలలు, చప్పట్లతో హోరెత్తించారు.

- పుట్టపర్తి, (ఆంధ్రజ్యోతి)



చంద్రబాబునాయుడుతో సవిత మాటామంతి


అక్రమ కేసులు బనాయించారు




ఐదేళ్ల వైసీపీ పాలనలో టీడీపీ కార్యకర్తలపై అక్రమ కేసులు బనాయించి, తీవ్ర ఇబ్బందులు పెట్టారు. వారందరినీ గుర్తు పెట్టుకుంటాం. ఎవ్వరినీ వదలం. ప్రతి కార్యకర్త ఈ ఎన్నికల్లో రెట్టింపు ఉత్సాహంతో పనిచేయాలి. టీడీపీని గెలిపించుకోవాలి.

- కందికుంట వెంకటప్రసాద్, కదిరి ఇన్‌చార్జి

సభావేదికపై చంద్రబాబు హావభావాలు...







ఒంటరి నడక..!

- వైసీపీ సమన్వయకర్తలకు అసమ్మతి సెగ
- సిట్టింగ్ ఎమ్మెల్యేలు దూరం
- కలిసిరాని శ్రేణులు
- దారికి తెచ్చుకునేందుకు ప్రయత్నాలు
- ఫలించక అయోమయ స్థితి

పుట్టపర్తి, ఆంధ్రజ్యోతి


సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న వేళ సిద్ధం అంటూ సీఎం జగన్ సభల్లో ఊదర గొడుతున్నారు. ఎన్నికల సంగ్రామానికి వైసీపీ శ్రేణులు సిద్ధం కావాలంటున్నారు. క్షేత్రస్థాయిలో వైసీపీ పరిస్థితి అందుకు విరుద్ధంగా ఉందన్న వాదన అన్నివర్గాల నుంచి వినిపిస్తోంది. ఎన్నికల వేళ వైసీపీ నియోజకవర్గ సమన్వయకర్తల మార్పుచేర్పులు చేపట్టింది. అందులో భాగంగా జిల్లాలో సిట్టింగ్ ఎంపీ, ఎమ్మెల్యేలను పక్కనపెట్టి ఇతరులను నియోజకవర్గ సమన్వయకర్తలుగా నియమించింది. దీంతో వైసీపీలో అసంతృప్తి చిచ్చురేగింది. సిట్టింగ్ ఎమ్మెల్యేతోపాటు అనుచరవర్గంలో అసమ్మతి జ్వాలలు చెలరేగి, ప్రతి నియోజకవర్గంలో ఎవరికి వారుగా కుంపట్లు పెట్టారు. నెలరోజులు దాటినా గ్రూపు రాజకీయాలు పెరుగుతున్నాయే తప్ప.. తగ్గట్లేదు. కొత్త సమన్వయకర్తలకు సొంత పార్టీ నుంచే సహకారం కొరవడడంతో నియోజకవర్గాల్లో పర్యటించలేని పరిస్థితి నెలకొంది. ఒకవైపు వైసీపీ ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్ర అసంతృప్తి.. మరోవైపు సొంత పార్టీ క్యాడర్ నుంచి సహాయ నిరాకరణతో సమన్వయకర్తలు దిక్కుతోచని స్థితిలో పడ్డారు. ప్రచారం చేసుకోవడానికే పరిమితమవుతున్నారు. జిల్లాలో కదిరి, పెనుకొండ, మడకశిర, హిందూపురం నియోజకవర్గాలకు కొత్త సమన్వయకర్తలను నియమించారు. ఇక్కడ వారితో పార్టీ నాయకులు, శ్రేణులు కలిసి రావడంలేదు. ఈ నేపథ్యంలో తమ సామాజికవర్గానికి చెందిన నాయకులు, అభిమానులు, సన్నిహితుల మద్దతు కోరడం తప్ప.. క్షేత్రస్థాయిలో నలుగురు నాయకులు, కార్యకర్తలను వెంట బెట్టుకుని, ఇంటింటా ప్రచారానికి వెళ్లలేకపోతున్నారు. నియోజక వర్గాల్లో సొంత పార్టీ వారి నుంచే సానుకూలత లేదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

అసమ్మతి సిద్ధం



హిందూపురం సిట్టింగ్ ఎంపీతోపాటు కదిరి, మడకశిర, పెనుకొండ ఎమ్మెల్యేను తప్పించి కొత్త సమన్వయకర్తలను నియమించారు. సిట్టింగ్ ఎంపీ, ఎమ్మెల్యేలతోపాటు అనుచరవర్గాలు తీవ్ర అసంతృప్తిలో ఉన్నాయి. కొత్త సమన్వయకర్తలతో సిట్టింగ్ ఎమ్మెల్యే అనుచరవర్గం అంటీముట్టనట్లు వ్యవహరిస్తోంది. సిట్టింగ్ ఎమ్మెల్యేలతోపాటు అసమ్మతి నేతలను తాడేపల్లి సీఎం క్యాంపు కార్యాలయానికి పలుమార్లు పిలిపించి, నయానో.. భయానో బుజ్జగిస్తున్నా సీఎం మాటలు లెక్కచేయడం లేదు. 'అభ్యర్థులను మీరే ఎంపిక చేశారు, మాతో ఏంపని ఉందం'టూ ధిక్కార గళం వినిపిస్తున్నారు. సిట్టింగ్ ఎమ్మెల్యేలు నియోజకవర్గం వైపు కన్నెత్తి చూడకపోగా.. అనుచరవర్గాలు పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉంటున్నాయి.

సిట్టింగ్ ఎమ్మెల్యేలు దూరం..



కదిరి, మడకశిర సిట్టింగ్ ఎమ్మెల్యేలు సిద్దారెడ్డి, తిప్పేస్వామిని పక్కన బెట్టి వైసీపీ అధిష్ఠానం కొత్త ముఖాలను తెరపైకి తెచ్చింది. మడకశిరకు సమన్వయకర్తగా ఈరలక్కప్పను అధిష్ఠానం ఎంపిక చేయడం పట్ల సిట్టింగ్ ఎమ్మెల్యే తిప్పేస్వామితోపాటు ఆయన వర్గీయుల పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉంటున్నారు. ఎమ్మెల్యే తిప్పేస్వామిపై అసమ్మతి గళం వినిపించిన నేతలు మాత్రం కొత్త సమన్వయకర్త వెంట నడుస్తున్నారు. వైసీపీ కదిరి సమన్వయకర్తగా మక్బూల్ నియామకంపై సిట్టింగ్ ఎమ్మెల్యే సిద్దారెడ్డి, ఆయన అనుచరులతోపాటు కొందరు ప్రజాప్రతినిధులు ఆగ్రహంగా ఉన్నారు. కొత్త సమన్వయకర్తకు ఎమ్మెల్యే సిద్దారెడ్డితోపాటు ఆయన వర్గీయులు కూడా సహకరించడంలేదు. మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ మిథున్‌రెడ్డి బుజ్జగింపులకు దిగినా వెనక్కి తగ్గకపోగా.. ఎవరికివారుగా ఉన్నారు. కొత్త సమన్వయకర్త నియామకం నాటి నుంచి ఎమ్మెల్యే సిద్దారెడ్డి పార్టీ కార్యక్రమాల్లో ఎక్కడా పాల్గొనలేదు. దీంతో నియోజకవర్గంలో పార్టీ క్యాడర్ డీలాపడిందని వైసీపీ వర్గాలే పేర్కొంటున్నాయి. మడకశిరలో కొత్త సమన్వయకర్తగా ఈరలక్కప్ప నియామకంతో సిట్టింగ్ ఎమ్మెల్యే తిప్పేస్వామితోపాటు ఆయన వర్గీయులు చాలామంది దూరంగానే ఉన్నారు. ఎమ్మెల్యే వర్గీయులతోపాటు పార్టీ నేతలు ఈరలక్కప్పను మార్చాలని వైసీపీ అధిష్ఠానానికి అల్టిమేటం జారీ చేశారు. ఈరలక్కప్ప ప్రచారం ప్రారంభించినా వెంట వెళ్తున్న పార్టీ శ్రేణులు అంటీముట్టనట్లు వ్యవహరిస్తున్నారు.

మొహం చాటేసిన శంకర్‌నారాయణ



పెనుకొండ సిట్టింగ్ ఎమ్మెల్యే శంకర్‌నారాయణను తప్పించి, కళ్యాణదుర్గం నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న మంత్రి ఉషశ్రీచరణ్‌ను సమన్వయకర్తగా వైసీపీ అధిష్ఠానం నియమించింది. దీంతో ఎమ్మెల్యే శంకర్‌నారాయణ మొహం చాటేశారు. ఈ మార్పు నేపథ్యంలో అధిష్ఠానంపై ఆయనతోపాటు పార్టీ శ్రేణులు తీవ్ర అసంతృప్తితో ఉన్నాయి. కొన్నాళ్లుగా శంకర్‌నారాయణ అనంతపురంలో మాకాం వేసి, నియోజకవర్గం వైపు తొంగిచూడడంలేదు. ఆయన వర్గీయుల్లో చాలామంది మంత్రి వెంట వెళ్లడంలేదు. మంత్రి ఉషశ్రీచరణ్.. సిట్టింగ్ ఎమ్మెల్యే పేరు వినిపించకుండా నియోజకవర్గంలో తన మార్కుకోసం ప్రయత్నాలు చేస్తుండడం శంకర్‌నారాయణ వర్గీయులకు మింగుడుపడడంలేదు. నియోజకవర్గం అంతా తన చేతిలో ఉండాలనీ, ఆదాయ వనరులపై దృష్టిపెట్టి అధికార యంత్రాంగాన్ని తన ఆధీనంలోకి తీసుకునే చర్యలు ప్రారంభించారు. ఇది పార్టీ వర్గాలకు మిగుడుపడడం లేదు.

పెద్దిరెడ్డి చెబితే వినాలా..

హిందూపురం సమన్వయకర్తగా ఆరు నెలల ముందుగానే దీపికను నియమించడంతో విభేదాలు తారస్థాయికి చేరాయి. బలమైన నేతలు ఆమెకు సహకరించట్లేదు. దీంతో హిందూపురంలో పార్టీని ఏకతాటిపైకి తీసుకొచ్చేందుకు డిసెంబరులో మంత్రి పెద్దిరెడ్డి వారం రోజులపాటు నియోజకవర్గంలో పర్యటించారు. అందరినీ ఒకే వేదికపైకి తీసుకొచ్చేందుకు ప్రయత్నించారు. మంత్రి అలా వెళ్లిపోయారో.. లేదో.. మళ్లీ ఎవరికివారుగా గ్రూపులు కట్టారు. సిట్టింగ్ ఎంపీ గోరంట్ల మాధవ్‌ను పక్కన పెట్టి బళ్లారికి చెందిన బీజేపీ మాజీ ఎంపీ శాంతను హిందూపురం పార్లమెంటు నియోజకవర్గ సమన్వయకర్తగా అధిష్ఠానం నియమించింది.

హిందూపురం పార్లమెంటు, అసెంబ్లీ నియోజకవర్గలు శాంత, దీపిక మధ్య వార్ నడుస్తోందన్న వాదనలు అధికార పార్టీ నుంచి వినిపిస్తున్నాయి. హిందూపురంలో ఎంపీ అభ్యర్థికి పార్టీ క్యాడర్ సహకరించట్లేదన్నది నిర్వివాదాంశం. ఈ పరిస్థితుల్లో నియోజకవర్గాల్లో ఏవర్గాన్ని కలవాలో తికమక పడుతున్నారు. హిందూపురం అసెంబ్లీ, పార్లమెంటు సమన్వయకర్తలతో అసమ్మతి నేతలు కలిసిరావడం లేదు.

పుట్టపర్తిలో తగ్గేదేలే..

పుట్టపర్తి సిట్టింగ్ ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డికి వచ్చే ఎన్నికల్లో టిక్కెట్ ఇస్తే కచ్చితంగా ఓడిస్తామని అసమ్మతి నేతలు ఇప్పటికే వైసీపీ అధిష్ఠానాన్ని హెచ్చరించారు. పుట్టపర్తి టిక్కెట్ ఆశిస్తున్న మాజీ సమన్వయకర్త సోమశేఖర్ రెడ్డి, నాయకులు పాముదుర్తి ఇంద్రజిత్ రెడ్డి, వైద్యుడు నాగేంద్రకుమార్‌రెడ్డి సమావేశమై ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డిపై తిరుగుబాటు చేశారు. ఎమ్మెల్యేకి వ్యతిరేకంగా అసమ్మతి వర్గంలోని ద్వితీయ శ్రేణి నేతలతోపాటు కార్యకర్తలు పలు సమావేశాలు నిర్వహించి మళ్లీ దుద్దకుంటకు ఇస్తే ఓడిస్తామని హెచ్చరించారు. తారస్థాయిని చేరిన అసమ్మతిని చల్లార్చేందుకు టిక్కెట్ ఆశిస్తున్న కొందరు నేతలతో సీఎం వద్ద పంచాయితీ పెట్టారు. మంత్రి పెద్దిరెడ్డిని రంగంలోకి దింపినా ఎమ్మెల్యే అసమ్మతి వర్గం ఏమాత్రం తగ్గలేదు. నియోజకవర్గంలో చెరువులను కష్ణాజలాలతో నింపుడు పేరుతో ఎమ్మెల్యే దుద్దకుంట శ్రీధర్‌రెడ్డి పాదయాత్రకు అసమ్మతి నేతలతోపాటు పలువురు ప్రజాప్రతినిధులు దూరంగా ఉన్నారు. ఈనేపథ్యంలో విద్యార్థులను పిలిపించి, యాత్ర సాగించారు. పుట్టపర్తి సిట్టింగ్ ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డికి మళ్లీ అవకాశం ఇస్తారా.. లేదా.. అన్న అనిశ్చితి పార్టీ క్యాడర్‌లో నెలకొంది.

ఓ రైతు పోరాటం..

విషాదాంతం..

ఎద్దులబండిని ఢీకొన్న లారీ... రైతు దుర్మరణం.. ఎద్దు కూడా..

యువ రైతు..
భార్య, ఇద్దరు పిల్లలు..
ఉన్నది రెండెకరాలు..
కష్టాన్ని నమ్ముకున్నాడు..
మరింత భూమి కౌలు చేశాడు..
అప్పులు చేసి..
పెట్టుబడులు పెట్టాడు.. ఏటా నష్టమే..
పంటలు పోతూనే ఉన్నాయి..
అప్పులు పెరుగుతూనే ఉన్నాయి..
బతుకు బండి భారమైంది..
ఎద్దుల బండే ఆధారమైంది..
ఎక్కడో దూరంలో ఉన్న ఇసుక తెచ్చి..
అమ్మి.. పొట్టపోసుకోసాగాడు..
తెల్లవారుజామునే..
బతుకు పోరాటానికి బయల్దేరిన
ఆ అన్నదాతను..
రోడ్డు ప్రమాదం బలి తీసుకుంది..
రైతన్న బతుకు విషాదాంతమైంది..
కుటుంబంలో చీకటి అలుముకుంది..



రైతు వెంకటరమణ (ఫైల్)



మృతిచెందిన ఎద్దు



రైతు మృతదేహం వద్ద విలపిస్తున్న కుంటుబసభ్యులు

తనకల్లు మండల కేంద్రంలోని బూడిదగడ్డవీధికి చెందిన యువరైతు వెంకటరమణ (38) విషాదాంతం ఇది. మండలంలోని మండ్లిపల్లి మిట్ట సమీపాన సోమవారం తెల్లవారు జామున 5.30 గంటల సమయంలో ఎద్దుల బండిని వెనుక నుంచి పెయింట్స్ లోడుతో వెళ్తున్న లారీ ఢీకొనడంతో రైతు వెంకటరమణ దుర్మరణం చెందాడు. ఓ ఎద్దు కూడా మరణించింది. నల్లచెరువు ఎస్‌ఐ లింగన్న తెలిపిన వివరాలివి. రైతు తనకున్న రెండెకరాలతోపాటు మరో మూడెకరాల పొలాన్ని కౌలుకు తీసుకుని, వర్షాధారం కింద వేరుశనగ సాగుచేస్తుండేవాడు. మూడేళ్లుగా అతివృష్టి, అనావృష్టి కారణంగా పంటలు చేతికి రాలేదు. దీంతో పంట పెట్టుబడికి తెచ్చిన అప్పులు రూ.4 లక్షలు దాటాయి. వాటిని తీర్చేందుకు, కుటుంబ పోషణ నిమిత్తం మండలంలోని కొక్కంటి సమీపాన పాపాగ్ని నది నుంచి ఇసుకను ఎద్దుల బండిలో తరలించి, విక్రయిస్తుండేవాడు. సోమవారం తెల్లవారుజామున 5.30 గంటల సమయంలో ఎద్దుల బండిలో ఇసుక కోసం పాపాగ్ని నదికి వెళ్తుండగా మండ్లిపల్లి మిట్ట సమీపంలో బళ్లారి నుంచి వేలూరుకు పెయింట్స్ లోడుతో వెళ్తున్న లారీ.. వెనుక నుంచి వేగంగా ఢీకొంది. ప్రమాదంలో రైతు వెంకటరమణ అక్కడికక్కడే మృతిచెందాడు. ఎద్దుల బండి నుజ్జునుజ్జయింది. ఒక ఎద్దు లారీ కిందపడి మృతిచెందింది. స్థానికులు.. రైతు కుటుంబికులకు సమాచారం అందించారు. కుటుంబ సభ్యులు ప్రమాద స్థలానికి చేరుకుని, రైతు మృతదేహంపై పడి బోరున విలపించారు. తనకల్లు పోలీసులు ఎక్స్‌కవేటర్ సాయంతో లారీ కింద మరణించిన ఎద్దును బయటకు తీశారు. రైతు మృతదేహాన్ని కదిరి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. రైతుకు భార్య సంధ్యారాణి, ఆరో తరగతి చదువుతున్న కుమారుడు కార్తీక్, రెండో తరగతి చదువుతున్న కుమార్తె శ్రీనిధి ఉన్నారు. రైతు భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు. ప్రమాదం అనంతరం లారీ డ్రైవర్ గోపీకృష్ణ తనకల్లు పోలీసు స్టేషన్‌లో లొంగిపోయాడు. రోడ్డు ప్రమాదంలో రైతు మృతితో.. ఎద్దుల బండ్లలో ఇసుకను తరలించే మిగతావారు భయాందోళనలు చెందుతున్నారు. తనకల్లు, మండ్లిపల్లి చుట్టుపక్కల గ్రామాలకు చెందిన పదిమంది దాకా రైతులు ఎద్దుల బండ్లలో ఇసుక తరలిస్తూ కుటుంబాలను పోషించుకుంటున్నారు.

-తనకల్లు



రక్తం పారిన చోట...




నీరు పారించా..!

- కాలువ గట్లపై నిద్రించి.. జిల్లాకు నీరిచ్చా
- కియను తీసుకొచ్చా.. దేశానికే ల్యాండ్ మార్క్‌గా మార్చా
- పెనుకొండకు కాదు.. కియ నగర్‌కు వచ్చినట్లుంది..
- అనంత అంటే అత్యంత ఇష్టం
- కరువు సీమలో సిరులు కురిపిస్తా
- రా.. కదలిరా.. సభలో చంద్రబాబు
- సీఎం జగన్‌పై నిప్పులు

పుట్టపర్తి, మార్చి 4(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి అనంతపురం జిల్లాలో ఒకప్పుడు పాలకులు రక్తం పారిస్తే.. తాను నీరు పారించానని టీడీపీ అధినేత నారా చంద్రబాబునాయుడు పేర్కొన్నారు. శ్రీసత్యసాయి జిల్లా పెనుకొండ మండలంలోని కియ కార్ల పరిశ్రమ వద్ద సోమవారం రా.. కదిలిరా.. సభ నిర్వహించారు. కార్యక్రమంలో చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ.. హంద్రీనీవా ద్వారా ఉమ్మడి జిల్లాకు కృష్ణాజలాలు తీసుకొచ్చి, వేలాది ఎకరాలకు నీరిచ్చి సస్యశ్యామలం చేశానన్నారు. గొల్లపల్లి రిజర్వాయర్ నిర్మాణాన్ని 18 నెలల్లో పూర్తి చేసి, నీరిచ్చానన్నారు. ప్రపంచంలోని మేటి పరిశ్రమైన కియను జిల్లాలో తీసుకొచ్చానన్నారు. వేల మందికి ఉద్యోగాలిచ్చానన్నారు. కరువు సీమలో సిరులు కురిపించానన్నారు. కియకి 600 ఎకరాల భూమి ఇచ్చి 50 వేల మందికి ఉపాధి చూపించానన్నారు. లేపాక్షి హబ్ పేరుతో చిలమత్తూరు, గోరంట్ల మండలాల్లో సీఎం జగన్ తక్కువ ధరకే రైతుల నుంచి భూములను లాక్కున్నాడని మండిపడ్డారు. తాను కియకి 600 ఎకరాల భూమి ఇచ్చి 50 వేల మందికి ఉపాధి చూపించాననీ, రైతుల నుంచి 8848 ఎకరాల భూములు తీసుకొని కనీసం ఒక్క పరిశ్రమైనా, ఒక్క ఉద్యోగమైనా తీసుకొచ్చావా జగన్ అంటూ ప్రశ్నించారు. లేపాక్షి హబ్ భూములు వివాదాల్లో కూరుకుపోయాయనీ, వేల కోట్లు విలువ చేసే వాటిని 500 కోట్లకు వేలం పెట్టిన ఘనత జగన్‌దని దుయ్యబట్టారు.



సోలార్ ప్లాంట్ ఏర్పాటు చేస్తే దేశానికే పవర్

అనంతపురం జిల్లాలో సోలార్ ప్లాంట్లు ఏర్పాటు చేస్తే దేశానికే పవర్ సరఫరా చేయవచ్చని చంద్రబాబు అన్నారు. తద్వారా రైతులు లబ్ధిపొందవచ్చాన్నారు. దేశంలోనే అనంత జిల్లాకు ప్రత్యేక స్థానం ఉందన్నారు. ఇక్కడ పంటలు కూడా తినడానికి రుచిగా ఉంటాయన్నారు. అపారమైన వనరులు ఉన్నాయనీ, వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. తాను ఐదేళ్ల అధికారంలో ఉండి కియ తెచ్చాననీ, పదేళ్లు ఉండుంటే జిల్లా అంతటా పరిశ్రమలు ఏర్పాటు చేయించేవాడనన్నారు. తద్వారా నిరుద్యోగ సమస్య పూర్తిగా సమసిపోయేదన్నారు.

కియ నగర్‌కు వచ్చినట్లుంది..

తాను పెనుకొండకు వచ్చినట్లు లేదనీ, కియ నగర్‌కు వచ్చినట్లుందని చంద్రబాబు పేర్కొన్నారు. హంద్రీనీవా ద్వారా నీటిని తేవడానికి రూ.4500 కోట్లు తమ హయాంలో ఖర్చు చేశానన్నారు. ఆ నీరు రావడంతోనే కియ పరిశ్రమ ఏర్పాటైందన్నారు. తద్వారా జిల్లా, రాష్ట్రమేకాక దేశానికే ల్యాండ్ మార్క్‌గా అయిందన్నారు. 20ఏళ్ల క్రితం కదిరి నియోజకవర్గంలో సైన్స్ సిటీ కోసం భూములు కొనుగోలు చేశారనీ, అది ఏమైందని పాలక పక్షాన్ని ప్రశ్నించారు. తాను సంపద సృష్టిస్తే జగన్ పేదలను దోచుకున్నాడన్నారు. జగన్ సీమ ద్రోహి అంటూ ధ్వజమెత్తారు. కాలువగట్లపై పడుకుని జిల్లాకు సాగునీరు ఇచ్చానన్నారు. ఎడారిగా పేరుగాంచిన జిల్లాలో సిరులు కురిపించానన్నారు. అధికారంలోకి రాగానే గోరంట్ల మండలానికి సాగునీరు ఇస్తాననీ, మడకశిరలో వక్క మార్కెట్ ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చారు. బాదుడులేని, కోతలులేని సంక్షేమం, మహిళల రక్షణ కోసం రా.. కదలిరా.. అని పిలుపునిచ్చారు. వచ్చే ఎన్నికల్లో వైసీపీని చిత్తుచిత్తుగా ఓడించాలని పిలుపునిచ్చారు. తనకు అనంతపురం అత్యంత ఇష్టమైన జిల్లా అన్నారు. ఇక్కడ 14 మంది ఎమ్మెల్యేలు, ఇద్దరు ఎంపీలను గెలిపిస్తే జిల్లాను సస్యశ్యామలం చేసే బాధ్యత తీసుకుంటానన్నారు.

కదంతొక్కిన తెలుగు తమ్ముళ్లు

కొత్తచెరువు, మార్చి 4: భగభగ మండే ఎండను సైతం లెక్కచేయకుండా సుదూర ప్రాంతాలను స్వచ్ఛందంగా రా కదలిరా బహిరంగసభకు అశేష జనవాహిని తరలిరావడంతో సభాప్రాంగణం జనసంద్రంగా మారింది. చిన్నాపెద్దా అన్న తారతమ్యం లేకుండా టీడీపీ, జనసేన పార్టీలకు చెందిన కార్యకర్తలు, నాయకులు తరలిరావడంతో జాతీయ రహదారి వాహనాలతో కిక్కిరిసిపోయింది. దీంతో పోలీసులు ట్రాఫిక్‌ను నియంత్రించి వాహనాలను సభా ప్రాంగణం సమీపంలో ఏర్పాటుచేసిన పార్కింగ్‌లకు తరలించారు. బుక్కపట్నం మండలం జానకంపల్లి గ్రామానికి చెందిన 70 సంవత్సరాల వృద్ధుడు మోటుపల్లి నాగభూషణం ఎన్టీఆర్, చంద్రబాబు, లోకేశ్‌లతో దిగిన ఫొటోలను రిక్షాకు అలంకరించుకుని ఎండను సైతం లెక్కచేయకుండా 45 కిలోమీటర్లు తొక్కుకుంటూరావడంతో అక్కడున్న నాయకులు, కార్యకర్తలు ఆయనను అభినందించారు. అదేవిధంగా ముదిగుబ్బ మండలానికి చెందిన దివ్యాంగుడు ఉత్తప్పయాదవ్ చంద్రబాబును చూసేందుకు తరలివచ్చాడు. వైసీపీ పాలనతో విసిగిపోయిన ప్రజలు వచ్చే ఎన్నికలలో టీడీపీకి పట్టం కట్టాలన్న తపనతో ఈ సభకు పోటెత్తుతూ జనం రావడంతో పోలీసులు, వైసీపీ నాయకులకు కళ్లు బైర్లుకమ్మాయి.


సభకు తరలివస్తున్న దివ్యాంగుడు


బాలయ్య వాహనాన్ని చుట్టిముట్టిన అభిమానులు


45 కిలోమీటర్లు రిక్షాపై వచ్చిన వృద్ధుడు నాగభూషణం

ఇదిగో.. వైసీపీ ఎమ్మెల్యేల చిట్టా..

హిందూపురం, మార్చి 4: పెనుకొండ నియోజకవర్గంలోని కియ కార్ల పరిశ్రమ వద్ద సోమవారం నిర్వహించిన రా.. కదిలిరా.. సభలో టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడు ప్రసంగంలో జిల్లాలోని వైసీపీ ఎమ్మెల్యేల అవినీతి చిట్టా విప్పారు. ఇలాంటి అవనీతిపరులను ఇంటికి సాగనంపుదామని టీడీపీ, జనసేన శ్రేణులకు పిలుపునిచ్చారు.

అక్కడ చెత్త.. ఇక్కడ బంగారమవుతుందా?

కళ్యాణదుర్గాన్ని సర్వస్వం దోచేసి మంత్రి ఉషశ్రీ పెనుకొండకు వచ్చారని చంద్రబాబు విమర్శించారు. ఆమె కళ్యాణదుర్గంలో చెత్త అయితే.. పెనుకొండకు వస్తే బంగారం ఎలా అవుతుందని బాబు ప్రశ్నించారు. ఈ నియోజకవర్గాన్ని కూడా ఆమె దోచేస్తారన్నారు.

తమ్ముళ్లకు నియోజకవర్గాన్ని దోచిపెట్టాడు..

పెనుకొండ ఎమ్మెల్యే శంకర్‌నారాయణ సీటు చిరిగిందని చంద్రబాబు ఎద్దేవా చేశారు. అనంతపురానికి బదిలీ చేశారన్నారు. ఆయన మొన్నటివరకు తమ్ముళ్లకు దోచి పెట్టాడన్నారు. ప్రతి పనికీ వారికి కప్పం కట్టాలనీ, పెన్నాను లూటీ చేసి ఇసుకను బెంగళూరుకి తరలించారని మండిపడ్డారు. వందల ఎకరాలను ఎమ్మెల్యే తమ్ముళ్లు ఆక్రమించారంటూ ధ్వజమెత్తారు.

దౌర్జన్యాలు, దోపిడీలకే తోపు

రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి రెడ్డి దౌర్జన్యాలు, దోపిడీలకే తోపు అనీ, అభివృద్ధికి కాదని చంద్రబాబు ఎద్దేవా చేశారు. లేఔట్ వేయాలంటే ఎమ్మెల్యేకు కప్పం కట్టాల్సిందేననీ, ఏ పని చేయాలన్నా కమీషన్ ఇచ్చుకోవాల్సిందేనని ఆరోపించారు. చెన్నేకొత్తపల్లి మండలంలో ఓ భూమిపై కన్నేసి ఆ రైతు ఇవ్వనన్నందుకు మామిడి తోటను నరికించిన నరహంతకుడు తోపుదుర్తి అంటూ మండిపడ్డారు.

ధర్మవరాన్ని పీడిస్తున్న కేటుగాడు..

ధర్మవరం ప్రాంతాన్ని పీడిస్తున్న కేటుగాడు ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి అని చంద్రబాబు పేర్కొన్నారు. గుడ్ మార్నింగ్ అని తిరుగుతూ ధర్మవరంలోని ప్రభుత్వ ఆస్తులన్నింటినీ దోచేశాడన్నారు. ఇక రాత్రిపూట ఈయన చేసే పనులు ఏమిటో అందరికీ తెలుసన్నారు. ఎర్రకుంటను మింగేసి ఫాంహౌస్ కట్టాడన్నారు. అక్కడ ఉదయం లేచిన వెంటనే గుర్రపుస్వారీ చేస్తాడన్నారు. ఇలాంటి కేతగాడు ప్రజలకు అవసరమా అని చంద్రబాబు ప్రశ్నించారు. సోలార్ ప్లాంట్‌కి ఇచ్చిన భూమిని బెదిరించి లాక్కున్న చరిత్ర కేతగాడిదన్నారు. ఉప్పలపాడు నుంచి ఇసుకను చెన్నై, బెంగళూరుకు తరలించి, వందల కోట్లు దోచేశాడన్నారు.

అతిపెద్ద అవినీతిపరుడు.. సిద్దారెడ్డి..


జిల్లాలోనే అతిపెద్ద అవినీతిపరుడు కదిరి ఎమ్మెల్యే సిద్దారెడ్డి అని ఆరోపించారు. ఈయన సీటును జగన్ చించేశాడన్నారు. ప్రతి పనుల్లో కమీషన్లు, వసూళ్లలో ఎమ్మెల్యే జోరు ప్రదర్శిస్తారన్నారు. కోనేరు ఆధునికీకరణ పేరుతో రూ.కోట్లు దండుకున్నాడన్నారు.

అవినీతి పుట్ట.. దుద్దకుంట..


జిల్లాలో అవినీతి పుట్టగా పుట్టపర్తి ఎమ్మెల్యే దుద్దకుంట శ్రీధర్‌రెడ్డి నిలిచాడని చంద్రబాబు విమర్శించారు. ఆయన సీటు కూడా ఊడే పరిస్థితి ఉందన్నారు. సొంత కార్యకర్తలను కూడా వదలకుండా దోచేసిన ఘనుడన్నారు. ఆఖరికి లేఔట్ వేస్తే దానిని కూడా వదలలేదన్నారు. పుట్టపర్తిలో వందల కోట్లు దోచాడంటూ ధ్వజమెత్తారు.

మడకశిరకు పట్టిన రోగం డాక్టర్ తిప్పేస్వామి

మడకశిర నియోజకవర్గానికి పట్టిన రోగం ఎమ్మెల్యే డాక్టర్ తిప్పేస్వామి అని చంద్రబాబు విమర్శించారు. ఆయనకు కూడా సీటు చిరిగిపోయిందన్నారు. ప్రతి పనికీ ముడుపులు తీసుకున్న ఎమ్మెల్యేగా పేరుగాంచారన్నారు. ఇసుకను బెంగళూరుకు తరలించి రూ.కోట్లు దండుకున్నాడన్నారు. ఇలాంటి ఎమ్మెల్యేలు అవసరమా, వీళ్లందరినీ ఇంటికి పంపే రోజులు దగ్గరపడ్డాయనీ, కార్యకర్తలు, ప్రజలు సిద్ధంగా ఉండాలని చంద్రబాబు పిలుపునిచ్చారు.


ఎన్టీఆర్ విగ్రహం వద్ద నివాళి అర్పిస్తూ...


సభావేదికపై ఉమ్మడి జిల్లా టీడీపీ, జనసేన నాయకులు


బాలయ్య.. చంద్రబాబు దరహాసం


చంద్రబాబుకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న దగ్గుబాటి ప్రసాద్


సీడీని విడుదల చేస్తున్న చంద్రబాబు...

మండుటెండను లెక్కచేయక.. పోటెత్తిన జనం

- కిక్కిరిసిన సభా ప్రాంగణం
- వాహనాల్లోనే వేలాది మంది
- రా కదలిరా సభ సూపర్ హిట్
- కియను చూసి మురిసిన చంద్రబాబు
- బాబు ప్రసంగానికి విశేష స్పందన

పుట్టపర్తి, మార్చి 4(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా ప్రతి పార్లమెంట్‌లో టీడీపీ అధినేత నారా చంద్రబాబునాయుడు నిర్వహించిన 25వ ముగింపు సభ సూపర్ హిట్ అయింది. సోమవారం పెనుకొండ మండలం ఎర్రమంచి కియ కార్ల పరిశ్రమ ఎదురుగా నిర్వహించిన 'రా.. కదలిరా' బహిరంగ సభకు మండుటెండను లెక్కచేయని టీడీపీ శ్రేణులతో పాటు జనసేన నాయకులు, సత్యసాయి జిల్లా నుంచి ప్రజలు పోటెత్తారు. చంద్రబాబు ప్రత్యేక హెలీక్యాప్టర్ మధ్యాహ్నం 3 గంటలకు కియా కార్ల పరిశ్రమ, గొల్లపల్లి రిజర్వాయర్ మీదుగా చక్కర్లు కొట్టి కియ ఎదురుగా ఏర్పాటుచేసిన హెలీప్యాడ్‌లో ల్యాండ్ అయ్యారు. చంద్రబాబు రాకను చూసిన జనం హర్షధ్వానాలు, కేరింతలతో స్వాగతం పలికారు. సభావేదిక వద్దకు వచ్చిన చంద్రబాబు 1.05 నిమిషాలపాటు రాయలసీమ, ఉమ్మడి జిల్లా టీడీపీ హయాంలో తీసుకువచ్చిన సాగునీటి ప్రాజెక్టులు, పరిశ్రమలపై ప్రస్తావన చేయడంతో సభికుల నుంచి విశేష స్పందన వచ్చింది. దేశానికే ల్యాండ్‌మార్క్ అయిన కియ కార్ల పరిశ్రమ ప్రస్తావన సభను పులకరింపచేసింది. టీడీపీ హయాంలో చేపట్టిన సాగునీటి ప్రాజెక్టులు, కాలువలు, రిజర్వాయర్‌లతో పాటు అంతర్జాతీయ కియ కార్ల పరిశ్రమ అనుబంధ పరిశ్రమల ఏర్పాటుతో జిల్లా రూపురేఖలనే మార్చేసిన వైనం సభికులను ఆకట్టుకుంది. రా కదలిరా రాష్ట్ర వ్యాప్తంగా 24 సభలు నిర్వహించి ముగింపు సభ పెనుకొండలో సూపర్‌సక్సెస్ అయ్యింది. పెనుకొండతోపాటు ఉమ్మడి జిల్లాల నుంచి టీడీపీ శ్రేణులతో పాటు ప్రజలు లక్షలాదిగా తరలివచ్చారు. సభాప్రాంగణమంతా జనసంద్రంలా మారి జాతీయ రహదారి 10 కిలోమీటర్ల మేర జనమేజనం కనిపించారు. ఓ వైపు మండుటెండ సలసల కాలుతున్నా జన ప్రవాహం మాత్రం ఆగలేదు. చంద్రబాబు ప్రసంగంలో టీడీపీ హయాంలో చేపట్టిన అభివృద్ధి, వైసీపీ పాలనలో చేపట్టిన అభివృద్ధి వ్యత్యాసాన్ని కళ్లకు కట్టినట్టు చూపించారు. ప్రధానంగా కియ పరిశ్రమ, జీడిపల్లి, భైరవాన్‌తిప్ప, మారాల, గొల్లపల్లి, చెర్లోపల్లి, మడకశిర ఉపకాలువ, జీడిపల్లి, కుప్పం హంద్రీనీవా కాలువలలో నీటి గలగలలను ప్రస్తావించారు. టీడీపీ హయాంలో తెచ్చిన కియ పరిశ్రమ టీడీపీ మార్క్ అని ప్రస్తావించారు. లేపాక్షి హబ్ భూములలో నేటి ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి కీలక సూత్రధారని, స్కీములు స్కాంలుగా మార్చిన ఘనత ఆయనకే దక్కిందన్నారు. 8840 ఎకరాల లేపాక్షి హబ్‌భూములలో ఒక్క పరిశ్రమైన, ఒక్క ఉద్యోగమైనా ఇచ్చారా అంటూ 600 ఎకరాల్లో కియ తెచ్చి 50వేల మందికి ఉద్యోగాలు ఇచ్చింది ఇది టీడీపీ మార్క్ అన్న ఉచ్ఛరణ సభికులను ఆనందింపచేసింది. సత్యసాయి జిల్లాల అధికార ఎమ్మెల్యేల అవినీతి, అక్రమాలు, దందాలపై చిట్టా విప్పి వీళ్లను ఈ ఎన్నికలలో తరలిమికొట్టాలని పిలుపునిచ్చారు. ముగింపు సభకు ఉమ్మడి జిల్లాల టీడీపీ నేతలు భారీగా హాజరయ్యారు. సభ అనంతరం ట్రాఫిక్ 5 గంటల సేపు స్తంభించింది. సభకు వచ్చిన జనం కియ వద్ద సెల్ఫీలు తీసుకోవడం ఇది టీడీపీ బ్రాండ్ అని అధికార పార్టీ నేతలకు సవాల్ విసిరారు. రా కదలిరా సభ సూపర్ సక్సెస్‌తో టీడీపీ, జనసేన నేతలతోపాటు పార్టీల శ్రేణులల్లో జోష్ వచ్చింది.


కియ పరిశ్రమ వద్ద జాతీయ రహదారిపై నిలిచిన వాహనాలు



మోదీని గద్దె దించడమే 'ఇండియా' లక్ష్యం

- సీపీఐ రాష్ట్రకార్యదర్శి రామకృష్ణ

అనంతపురం విద్య, మార్చి 4: ప్రధాన మంత్రి నరేంద్రమోదీని గద్దె దించడమే ఇండియా కూటమి లక్ష్యమని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ అన్నారు. సోమవారం అనంతపురం, సత్యసాయి జిల్లాల సీపీఐ నాయకుల సర్వసభ్య సమావేశం వీకే భవన్‌లో నిర్వహించారు. రామకృష్ణ మాట్లాడుతూ మోదీ పదేళ్లుగా ప్రధానిగా ఉంటున్నా ప్రజలకు చేసిందేమీ లేదన్నారు. ఆయన ఓట్లు అడిగే ముందు దేశ ప్రజలకు ఏం చేశారో చెప్పాలన్నారు. 2047 నాటికి వికాస్ భారత్ పేరుతో అభివృద్ధి చేస్తానంటూ ప్రజలను మరోసారి మభ్యపెట్టాలని చూస్తున్నాడన్నారు. అయితే ఈ పదేళ్లలో ఆయన పేదవాడికి ఏమీ చేయలేదని, రైతులకు అన్యాయం చేశారని,వి దేశాల్లో ఉన్న బ్లాక్ మనీని వెనక్కి తీసుకురాలేక ఒక అసమర్థ ప్రధానమంత్రిగా ఉన్నాడన్నారు. అదానీ, అంబానీ వంటి కార్పొరేట్ దిగ్గజాలకు ఊడిగం చేస్తున్నారంటూ మండిపడ్డారు. బీజేపీ బ్లాక్ మెయిల్ రాజకీయాలు చేస్తోందని, దేశాన్ని కాపాడ్డానికే ఇండియా కూటమిని మరింత బలోపేతం చేస్తామన్నారు. ఇండియా కూటమి ఆధ్వర్యంలో 7న గుంటూరు, 11న విశాఖలో భారీ బహిరంగ సభలు నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జగదీష్, జిల్లా కార్యదర్శి జాఫర్, సత్యసాయి జిల్లా కార్యదర్శి వేమయ్య, ఇతర నాయకులు నారాయణస్వామి, మల్లికార్జున, శ్రీరాములు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న సీపీఐ రామకృష్ణ

గంజాయి విక్రేత అరెస్ట్


గంజాయి విక్రేతను చూపుతున్న సీఐ

గుత్తి, మార్చి 4: గుత్తి పట్టణ శివారులోని పత్తికొండ రోడ్డులో గంజాయి విక్రయిస్తున్న సౌద నరేష్‌ను అరెస్ట్ చేసి, అతడి నుంచి 1.149కేజీల గంజాయిను స్వాధీనం చేసుకున్నట్లు ఇన్చార్జి సీఐ రాజశేఖర్ రెడ్డి తెలిపారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో విలేకరుల సమావేశంలో అరెస్ట్ వివరాలను వెల్లడించారు. గుత్తి రోడ్డులోని పత్తికొండ రోడ్డులో గంజాయి విక్రయిస్తున్నరని సమాచారం మేరకు తాను, ఎస్ఐ నబీరసూల్ కలసి దాడులు నిర్వహించామన్నారు. గంజాయి విక్రయిస్తున్న గుత్తి మండలం టీ కొత్తపల్లి గ్రామానికి చెందిన సౌద నరేష్, అలియాస్ ముంబాయినరేష్, అలియాస్ గాలిగాడును అదుపలోకి తీసుకుని అతని వద్ద నుంచి 420గ్రాముల కలిగిన 52గంజాయి ప్యాకెట్లను 720గ్రాములు లుజూగా ఉన్న గంజాయి స్వాధీనం చేసుకుని సీజ్ చేశామన్నారు. ఇతనిపై గతంలో నాటుసారాతో పాటు పలు దొంగతనాల కేసుల్లో ముద్దాయి అన్నారు. ఈ కేసుకు సంబంధించి మరికొంత మందిఉన్నారని వారిని త్వరలోనే అరెస్ట్ చేస్తామని సీఐ తెలిపారు.

నేడు పలు గ్రామాల్లో భవిష్యత్తు గ్యారెంటీ

ధర్మవరం రూరల్, మార్చి 4: మండలంలోని రావులచెరువు, ఎర్రగుంటపల్లి, ఎర్రగుంటపల్లితండా గ్రామాల్లో మంగళవారం పరిటాల శ్రీరామ్ ఆధ్వర్యంలో బాబుష్యూరిటీ భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు టీడీపీమండలకన్వీనర్ పోతుకుంట లక్ష్మన్న సోమవారం ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి మండల నాయకులు, కార్యకర్తలు, వివిధ అనుబంధ సంఘాల నాయకులు పెద్దఎత్తున తరలి వచ్చి విజయవంతం చే యాలని కోరారు. ఉదయం 10.30గంటలకు రావులచెరువు గ్రామానికి తరలిరావాలని తెలిపారు.

టీడీపీ రాష్ట్రకమిటీలో జిల్లా వాసులకు చోటు

పుట్టపర్తి రూరల్, మార్చి 4: తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడు ఆదేశాల మేరకు సోమవారం ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కింజరాపు అచ్చెన్నాయుడు ప్రకటించిన రాష్ట్రకమిటీలో శ్రీసత్యసాయి జిల్లా వాసులకు చోటు దక్కింది. ఈ మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం సోమవారం ఒక ప్రకటన విడుదల చేసింది. ఇందులో భాగంగా తెలుగుదేశం పార్టీ విభిన్నప్రతిభావంతుల రాష్ట్రఅదనపు కమిటీలో కదిరి పట్టణానికి చెందిన జొట్టూరు కుళ్ళాయప్పను అధికారప్రతినిధిగా, అలాగే ముస్లింమైనారిటీ రాష్ట్రకమిటీ అదనపు విభాగంలో కదిరికే చెందిన షేక్ మహ్మద్ అక్రమ్‌ను అధికార ప్రతినిధిగా నియమిస్తూ రాష్ట్ర అధ్యక్షుడు ఉత్తర్వులు జారీ చేశారు.

ఇంటింటా పల్స్‌పోలియో తనిఖీ

ఓబుళదేవరచెరువు, మార్చి 4: మండలంలో సోమవారం ఇంటింటా చేపట్టిన పల్స్‌పోలియో కార్యక్రమాన్ని జిల్లా ఇమ్యూనేషన్ అధికారి డాక్టర్ కృష్ణయ్య తనిఖీ చేశా రు. కొండకమర్ల, ఓబుళదేవరచెరువు, డబురువారిపల్లి త దితర గ్రామాల్లో పర్యటించి వైద్యసిబ్బంది ఇంటింటికీ వెళ్లి మిగిలిన చిన్నారులకు పోలియో చుక్కలు వేయడాన్ని ఆయన తనిఖీ చేశారు. మరింత మెరుగైన ఫలితాలు సా ధించడానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సిబ్బందికి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో జిల్లా పబ్లిక్ హెల్త్ నర్సు అధికారిణి వీరమ్మ, వైద్యులు భానుప్రకాష్‌నాయక్, డాక్టర్ కమల్ రోహిత్, దిల్‌షాద్ తదితరులు ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలు

ధర్మవరం, మార్చి 4: పట్టణంలోని కళాజ్యోతి సర్కిల్‌లో ద్విచక్రవాహనాన్ని టిప్పర్ ఢీకొన్న ప్రమాదంలో ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. వన్‌టౌన్ పోలీసులు తెలిపిన మేరకు వివరాలిలా ఉన్నాయి. బత్తలపల్లి మండలం వరదాపురం గ్రామానికి చెందిన శివారెడ్డి సోమవారం ఆధార్ అప్‌డేట్ కోసం ద్విచక్రవాహనంలో ధర్మవరానికి వచ్చాడు. పని అనంతరం తిరిగి స్వగ్రామానికి బయలుదేరాడు. కాగా కళాజ్యోతి సర్కిల్లోకి రాగానే వెనుక నుంచి వచ్చిన టిప్పర్ ఢీకొంది. ప్రమాదంలో శివారెడ్డి తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు వెంటనే ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ ప్రథమ చికిత్స అనంతరం కుటుంబసభ్యులు మెరుగైన వైద్యం కోసం అనంతపురం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

బిల్లు బుక్కుల అస్పష్టతపై ఆడిట్ అధికారి ఆగ్రహం

- ఇలా ఉంటే ఎలా ఆడిట్ చేయాలని మండిపాటు

కొత్తచెరువు, మార్చి 4: మేజర్ గ్రామ పంచాయతీలో ఆడిట్ చేయడానికి జిల్లా పంచాయతీ రాజ్ కార్యాలయం నుంచి ఆడిట్ అధికారి రవిశంకర్ సోమవారం వచ్చారు. అయితే పంచాయతీ కార్యదర్శి గోపాల్ సెలవుపై వెళ్లారు. దీంతో గుమస్తా పంచాయతీలో చేసిన అభివృద్ధికి సంబంధించిన బిల్లు బుక్కులను ఆడిట్ అధికారికి అందజేశారు. అయితే ఆ బిల్లు బుక్కులు అస్పష్టగా ఒకదానికి ఒకటి పొంతన లేకుండా ఉండటంతో ఆడిట్ ఎలా నిర్వహించేది అంటూ అధికారి మండిపడ్డారు. మేజర్ పంచాయతీలో అభివృద్ధి పనులకు ఏమేమి ఖర్చుచేశారో, కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాల నుంచి వచ్చిన నిధులు దేనికి ఖర్చు పెట్టారు వంటి వివరాలను బిల్లుబుక్కులలో పొందు పరచకపోతే ఎలా అంటూ ప్రశ్నించారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళతామన్నారు. ఈ విధంగా ఉండటం వల్ల తాను ఆడిట్ చేయలేనంటూ ఆయన అక్కడి నుంచి వెళ్లిపోయారు.



పెనుకొండ సమీపంలోని కియ పరిశ్రమ వద్ద సోమవారం నిర్వహించిన రా.. కదలిరా.. బహిరంగ సభకు వచ్చిన చంద్రబాబుకు పుష్పగుచ్ఛం, సత్యసాయి చిత్రపటం అందించి స్వాగతం పలుకుతున్న టీడీపీ ధర్మవరం నియోజకవర్గ ఇన్‌చార్జి పరిటాల శ్రీరామ్, జిల్లా ప్రధాన కార్యదర్శి సామకోటి ఆదిరాయణ, బహిరంగ సభలో పాల్గొన్న కదిరి నియోజకవర్గ ఇన్‌చార్జి కందికుంట వెంకట ప్రసాద్, మాజీ మంత్రి పల్లె రఘునాథ రెడ్డి

కలెక్టరేట్‌లో స్పందనకు 187 వినతులు

- స్వీకరించి పరిశీలించిన జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్
- సమస్యల్ని వెంటనే పరిష్కరించాలని అధికారులకు ఆదేశం

పుట్టపర్తి, మార్చి 4: జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమానికి 187 వినతిపత్రాలు అందాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల ప్రజలు కలెక్టరేట్‌కు విచ్చేసి పలు సమస్యల పరిష్కారం కోరుతూ ఈ వినతులను అందించారు. వాటిని జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్ స్వీకరించి పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ స్పందనలో ప్రజలు వినతుల ద్వారా తెలిపిన సమస్యల్ని వెంటనే పరిష్కరించాలని ఆయా అధికారులను ఆదేశించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ ఆలస్యం చేయరాదన్నారు. పంట నష్ట పరిహారం ఇప్పించాలంటూ కొత్తచెరువుకు చెందిన రామాంజినేయులు వినతిపత్రం ఇచ్చారు. అలాగే కదిరి మున్సిపాలిటీ పరిధిలోని మెహర్‌నగర్‌లో ఉన్న తమ ఇల్లు లేఅవుట్ వేయడంతో ధ్వంసమైందని ప్రత్యామ్నాయంగా మరో ఇల్లు మంజూరు చేయాలంటూ దిల్షాద్ కోరారు. రోడ్డు విస్తరణలో తమ ఇల్లు నష్టపోయానని తనకు న్యాయం చేయాలంటూ ఓడీసీ మండలం అల్లాపల్లి గ్రామానికి చెందిన వరలక్ష్మి వినతి చేశారు. ఇలా వివిధ సమస్యలను పరిష్కరించాలంటూ ప్రజలు వినతులు అందించారు. కార్యక్రమంలో డీఆర్వో కొండయ్య, డీఆర్‌డీఏ పీడీ నరసయ్య, నోడల్ అధికారి శివారెడ్డి, డీపీఓ విజయ్‌కుమార్, ఆర్డీఓ భాగ్యరేఖ, తదితరులు పాల్గొన్నారు.

పోలీస్ స్పందనకు 22 వినతులు

పుట్టపర్తి రూరల్: జిల్లాకేంద్రంలోని పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన స్పందనకు 22 వినతిపత్రాలు అందాయి. జిల్లాలోని పలు ప్రాంతాల ప్రజలు వివిధ సమస్యల పరిష్కారం కోరుతూ వాటిని అందజేశారు. ఎస్పీ మాధవ రెడ్డి వాటిని స్వీకరించి క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ చట్టపరిధిలో ఉన్న ప్రజల సమస్యలను వెంటనే పరిష్కరించాలని పోలీసు అధికారులకు సూచించారు. స్పందనలో తెలిపిన సమస్యల్ని మొదటి ప్రాధాన్యతగా తీసుకుని పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో ఎక్కువగా రస్తావివాదాలు, కుటుంబకలహాలు, భూవివిదాలు, ఆర్థిక మోసాలకు సంబంధించిన ఫిర్యాదులు ఎక్కువగా ఉన్నాయి. కార్యక్రమంలో దిశ డీఎస్పీ శ్రీనివాసరావు, డీసీఆర్బీ సీఐ శ్రీహర్ష, లీగల్ అడ్వైజర్ విశ్వనాథరెడ్డి సిబ్బంది పాల్గొన్నారు.

దాడి చేశారని మహిళా కండెక్టర్ ఫిర్యాదు

నల్లమాడ, మార్చి 4: మండలంలోని పులగంపల్లి బస్‌స్టాప్ సమీపంలో బస్సు ఆపలేదని ఇద్దరు మహిళా ప్రయాణికులు కండెక్టర్ లక్ష్మీనరసమ్మపై దాడి చేశారు. ఈ మేరకు ఆమెతో పాటు కదిరి డీఎం షైనొద్దీన్, అసిస్టెంట్ మేనేజర్లు హరిత, హరిమోహన్ కలిసి సోమవారం మండలకేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. వారు మాట్లాడుతూ.. హిందూపురం నుంచి కదిరికి వస్తున్న ఆర్టీసీ బస్సు ఆదివారం రాత్రి 7.30గంటల సమయంలో పుల్లగంపల్లికి చేరుకుందని, కాగా అక్కడ బస్సులో ఉన్న ఇద్దరు మహిళా ప్రయాణికులు బస్సు ఆపమని చెప్పగా.. కొద్దిగా ముందుకెళ్లి నిలిపారని, దీంతో ఆగ్రహం చెందిన వారు కండెక్టర్‌పై పిడిగుద్దులు గుద్ది గాయపరిచారని, మిగిలిన ప్రయాణికులు అడ్డుకున్నారని చెప్పారు. దాడిచేసిన వారిని అరెస్టు చేసి, కేసు నమోదు చేయాలని ఫిర్యాదులో పేర్కొన్నారు.

ఎస్పీని కలిసి ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి

పుట్టపర్తి రూరల్, మార్చి 4: జిల్లా స్పెషల్ ఎన్‌ఫోర్సుమెంట్ అధికారి నాగభూషణం సోమవారం ఎస్పీ మాధవరెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. జిల్లాలో నూతన ంగా బాధ్యతలు చేపట్టిన ఆయన ఎస్పీని కలిసి పుష్పగుచ్ఛం అందచేశారు. ఈసందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ జిల్లాలో అక్రమ మద్యంను పూర్తిగా నిర్మూలించాలని సూచించారు. నాగభూషణం గతంలో విజయవాడ ఇంటలిజెన్స్ విభాగంలో పనిచేశారు.

విషపు నీరు తాగి 14 మేకలు మృతి



మృతి చెందిన మేకలు

ముదిగుబ్బ, మార్చి4: మండలంలోని బీడిమర్రి గ్రామంలో విషపునీరు తాగి 14 మేకలు మృతి చెందినట్లు బాధితుడు గంగప్ప తెలిపారు. ఘటనపై బాధితుడు తెలిపిన మేరకు వివరాలిలా ఉన్నాయి. సోమవారం ఉదయాన్నే 35 మేకలను అడవిలోకి మేతకు తీసుకొని వెళ్లానని, కొద్దిసేపటి తర్వాత ఇంటికి తిరిగి వస్తున్న సమయంలో.. గ్రామ సమీపంలోని ఒకతోటలో మొక్కలకు పిచికారీ చేయడానికి కలిపిన విషపు నీటిని 14 మేకలు తాగాయని, వెంటనే అస్వస్థతకు గురై అక్కడిక్కడే మరణించాయని వాపోయారు. అప్రమత్తమై మిగతా వాటిని తాగకుండా అడ్డుకున్నామన్నారు. మేకలు చనిపోవడంతో దాదాపు రూ. 1.50లక్షల మేర నష్టం వాటిల్లిందన్నారు. మేకలను పెంచుకుంటూ జీవనం సాగిస్తున్నానని, ప్రభుత్వం స్పందించి ఆదుకోవాలని ఆయన కోరారు.

స్థానికంగా పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేయాలి



విలేకరులతో మాట్లాడుతున్న మహిళలు

పుట్టపర్తి, మార్చి 4 : ఎక్కడో రెండు కిలోమీటర్ల దూరంలో గుంటిపల్లిలో ఉన్న పోలింగ్ కేంద్రానికి వెళ్లాలంటే కష్టంగా ఉందని, స్థానికంగా మామిళ్లకుంట క్రాస్‌లో పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేయాలంటూ ఆ గ్రామ మహిళలు కోరారు. ఈ మేరకు సోమవారం గౌరమ్మ, అంజినమ్మ, ఓబుళమ్మ, చిన్ననాగమ్మ, నరసక్క, రాములమ్మ తదితరులు కలెక్టరేట్‌కు చేరుకుని జేసీ అభిషేక్ కుమార్‌ను కలిసి వినతిపత్రం అందించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ.. ప్రతిసారీ కొత్తచెరువు మండలం లోచర్ల గ్రామం గుంటిపల్లి పోలింగ్ కేంద్రానికి వెళ్లి ఓటు వేస్తున్నామని పేర్కొన్నారు. అయితే మేము పుట్టపర్తి మండలం మామిళ్లకుంట క్రాస్ నివాసముంటున్నామని, అంతదూరం వెళ్లి ఓటు వేయాలంటే కష్టంగా ఉందని తెలిపారు. దాదాపు 500మంది ఓటర్లున్నామని, మా ప్రాంతంలోనే పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేయాలని కోరారు.

కబ్జా భూముల్ని తిరిగి స్వాధీనం చేసుకోవాలి



కలెక్టరేట్ వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న లేబర్ రైట్స్ ప్రొటెక్షన్ ఫోరం ప్రతినిధులు

పుట్టపర్తి, మార్చి 4: జిల్లా కేంద్రంలో వందల ఎకరాల ప్రభుత్వ భూమిని బడా వ్యక్తులు కబ్జా చేశారని, వాటిని వెంటనే తిరిగి స్వాధీనం చేసుకోవాలంటూ లేబర్ రైట్స్ ప్రొటెక్షన్ ఫోరం ప్రతినిధులు నూతిమడుగు గోవిందరెడ్డి, డీజీ రాజు, మారుతి, సత్యనారాయణ, సాకే రాజేంద్ర డిమాండ్ చేశారు. ఫోరం ఆధ్వర్యంలో సోమవారం వారు జిల్లాకేంద్రంలోని కలెక్టరేట్‌కు చేరుకుని నిరసనకు దిగారు. ఈ సందర్భంగా ఫోరం అధ్యక్షుడు నూతిమడుగు గోవిందరెడ్డి మాట్లాడుతూ.. పుట్టపర్తి, కొత్తచెరువు మండలాల పరిధిలోని ప్రభుత్వ భూములను బడానేతలు కబ్జా చేసి రియల్ వ్యాపారం చేస్తున్నారని మండిపడ్డారు. ముఖ్యంగా లోచర్ల, కప్పలబండ, కొత్తచెరువు రెవెన్యూగ్రామాల పరిధిలోని ప్రభుత్వ భూములు కబ్జాకు గురయ్యాయన్నారు. పేదలకు ఇల్లు నిర్మించుకునేందుకు సెంటు స్థలం ఇవ్వరుకానీ.. బడా నేతలు కబ్జా చేస్తుంటే.. అధికారులు చోద్యం చూస్తున్నారని మండిపడ్డారు. సంబంధిత అధికారులు వాటిని వెంటనే తిరిగి స్వాధీనం చేసుకోవాలని డిమాండ్ చేశారు. లేకపోతే ఉద్యమిస్తామంటూ హెచ్చరించారు. అనంతరం జేసీ అభిషేక్‌కుమార్‌కు వినతిపత్రం అందించారు.



పది ప్రశ్నపత్రాలను దింపుతున్న దృశ్యం

పది ప్రశ్నపత్రాలు వచ్చేశాయ్..

కొత్తచెరువు, మార్చి 4: జిల్లాకు పదో తరగతి ప్రశ్నపత్రాలు సోమవారం చేరుకున్నాయి. ఈనెల 18వ తేదీ నుంచి పది పబ్లిక్ పరీక్షలు నిర్వహించనున్న నేపథ్యంలో విజయవాడ నుంచి ప్రత్యేక వాహనంలో ప్రశ్నపత్రాలు జిల్లాకు వచ్చాయి. వాటిని కొత్తచెరువులోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూంలో విద్యాశాఖ అధికారులు భద్రపరిచారు. తొలివిడత కింద 116 బండిల్స్ (22వేలుపైగా) ప్రశ్నపత్రాలు వచ్చాయని డీఈఓ మీనాక్షి తెలిపారు. వాటిని ఆమె దగ్గరుండి స్ట్రాంగ్‌రూంలో భద్రపరిచారు. వీటిని మంగళవారం నుంచి సంబంధిత మండలాల్లో కేటాయించిన పోలీసు స్టేషన్లకు తరలించి, భద్రపరచనున్నట్లు డీఈఓ తెలిపారు. కార్యక్రమంలో జిల్లా పరీక్షల విభాగాధికారి లాజర్, విద్యాశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

ఆంగ్ల పరీక్షకు 425 మంది గైర్హాజరు

కొత్తచెరువు, మార్చి 4: జిల్లావ్యాప్తంగా సోమవారం నిర్వహించిన ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం ఆంగ్ల పరీక్షకు 425 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. మొత్తం 12,525 మంది పరీక్షలు రాయాల్సి ఉండగా.. 425 మంది గైర్హాజరయ్యారు. దీంతో 12,101 మంది పరీక్షలు రాసినట్లు ఆర్ఐఓ సురేశ్‌బాబు తెలిపారు.

బత్తలపల్లిలో ఇరువర్గాల ఘర్షణ

ధర్మవరం/బత్తలపల్లి, మార్చి 4: బత్తలపల్లి మండల కేంద్రంలో మాజీ ఎమ్మెల్యే గోనుగుంట్ల సూర్యనారాయణ, టీడీపీ ధర్మవరం నియోజకవర్గ ఇన్‌చార్జి పరిటాల శ్రీరామ్ వర్గీయుల మధ్య సోమవారం ఘర్షణ తలెత్తింది. టీడీపీ ఆధ్వర్యంలో జిల్లాలోని పెనుకొండ సమీపాన కియ కార్ల పరిశ్రమ వద్ద సోమవారం 'రా.. కదలిరా..' సభను ఏర్పాటు చేశారు. ఈ సభకు పార్టీ అధినేత చంద్రబాబునాయుడు వస్తుండటంతో గోనుగుంట్ల సూర్యనారాయణ, పరిటాల శ్రీరామ్ వర్గీయులు ఎవరికివారు ధర్మవరం నియోజకవర్గంలో భారీఎత్తున జనసమీకరణకు పూనుకున్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా వాహనాలను సమకూర్చారు. పరిటాల శ్రీరామ్ వర్గీయులు బత్తలపల్లిలోని టీడీపీ కార్యాలయం వద్ద వాహనాలతో పెనుకొండకు వెళ్లడానికి సిద్ధంగా ఉన్నారు. అదే సమయంలో ముదిగుబ్బకు చెందిన గోనుగుంట్ల వర్గీయులు నినాదాలు చేసుకుంటూ వచ్చారు. దీంతో వారి వాహనాలను పరిటాల వర్గీయులు అడ్డుకున్నారు. తమను చూసి ఎందుకు నినాదాలు చేస్తున్నారని ప్రశ్నించారు. ఆగ్రహంతో వాహనాలపై రాళ్లు రువ్వారు. దీంతో పలువురు గాయపడ్డారు. వాహనాల అద్దాలు ధ్వంసమయ్యాయి. ఈ దాడి అనంతరం గోనుగుంట్ల వర్గీయులు బత్తలపల్లి నాలుగురోడ్ల కూడలికి చేరుకుని, జాతీయ రహదారిపై ధర్నాకు దిగారు. కాసేపటికి అక్కడికి చేరుకున్న పరిటాల వర్గీయుల వాహనాలపై గోనుగుంట్ల వర్గీయులు దాడి చేశారు. 20కి పైగా తమ వాహనాల అద్దాలు ధ్వంసమయ్యాయని గోనుగుంట్ల వర్గీయులు ఆరోపించగా, తమ ఏడు వాహనాల అద్దాలు ధ్వంసమయ్యాయని పరిటాల వర్గీయులు ఆరోపించారు. పరస్పర దాడులతో బత్తలపల్లి సర్కిల్‌లో కాసేపు ఉద్రిక్త వాతావరణం నెలకొంది. బత్తలపల్లి పోలీసులు అక్కడికి చేరుకుని, గోనుగుంట్ల వర్గీయులకు సర్దిచెప్పి పంపించేశారు.

సమస్యలను వెంటనే పరిష్కరించాలి

- లేకపోతే సమ్మెలోకి వెళతాం
- ఎంజీఎన్ఆర్‌జీఎస్ జేఏసీ హెచ్చరిక



ఎంపీడీఓ కార్యాలయం వద్ద నల్లబాడ్జీలు ధరించి నిరసన తెలుపుతున్న ఉపాధి పథకం జేఏసీ నాయకులు, సిబ్బంది

పుట్టపర్తి రూరల్, మార్చి 4: ఉపాధిహామీ పథకం సిబ్బంది సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని ఆ పథకం జేఏసీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం వారు పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయం వద్ద నల్లబాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా నాయకుడు నంజిరెడ్డి మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రిక్రూట్‌మెంట్ చట్టం ద్వారా ఎంపికైన తమను క్యాడర్‌పరంగా గాని, గ్రేడ్ పరంగా విభజించాలని ఎన్నిసార్లు ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు, తమ సమస్యలను పరిష్కారం కోసం ప్రభుత్వానికి ఏడురోజులు గడువు ఇస్తున్నామని , ఆ సమయంలోగా తమ సమస్యల్ని పరిష్కరించాలన్నారు. లేకపోతే సమ్మెలోకి దిగుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో జేఏసీ నాయకులు, ఉపాధి సిబ్బంది రాజశేఖర్, రవి,పుష్పలత, తేజ, ఆదిరెడ్డి, మౌలిలు పాల్గొన్నారు.

రా.. కదలిరా.. సభకు భారీగా తరలిన తెలుగు తమ్ముళ్లు



పుట్టపర్తిలోని సత్తెమ్మ ఆలయంలో పూజలు చేస్తున్న మాజీ మంత్రి పల్లె



సభకు బయలుదేరుతున్న ధర్మవరంలోని 25వ వార్డు టీడీపీ శ్రేణులు



ధర్మవరం మండల నాయకులు..

పుట్టపర్తి, మార్చి 4: పెనుకొండ సమీపంలోని కియ కార్ల పరిశ్రమ వద్ద సోమవారం టీడీపీ అధినేత నారాచంద్రబాబు నిర్వహించిన రా.. కదలిరా .. సభకు పుట్టపర్తి పట్టణం నుంచి భారీగా తెలుగుతమ్ముళ్లు తరలివెళ్లారు. ఉదయమే మాజీ మంత్రి పల్లె రఘునాథ రెడ్డి స్థానిక సత్తెమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వందలాది వాహనాలతో తెలుగుతమ్ముళ్లతో కలిసి సభకు తరలి వెళ్లారు. తె లుగు యువత నాయకులు, కార్యకర్తలు పలు వాహనాల్లో ఎంతో ఉత్సాహంగా తరలివెళ్లారు.

ధర్మవరం: రా కదలిరా బహిరంగసభకు ధర్మవరం నుంచి భారీఎత్తున టీడీపీ శ్రేణులు తరలివెళ్లారు. నియోజకవర్గ ఇన్‌చార్జి పరిటాల శ్రీరామ్ పిలుపు మేరకు 25వ వార్డు ఇన్‌చార్జి భీమనేని ప్రసాద్‌నాయుడు ఆధ్వర్యంలో 5 వాహనాల్లో పార్టీ శ్రేణులు సభకు తరలివెళ్లారు. అదేవిధంగా 40 వార్డుల నుంచి కూడా భారీగా ప్రత్యేక వాహనాలలో తరలివెళ్లారు.

ధర్మవరంరూరల్: టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పరిటాల శ్రీరామ్ ఆదేశాల మేరకు ధర్మవరం రూరల్ మండలం నుంచి పార్టీ నాయకులు, కార్యకర్తలు భారీగా చంద్రబాబు సభకు తరలివెళ్లారు. ప్రతిగ్రామం నుంచి ప్రత్యేకవాహనాల్లో బయలుదేరి వెళ్లారు. తరలినవారిలో మాజీ జడ్పీటీసీ మేకలరామాంజినేయులు, నాయకులు భాస్కర్‌చౌదరి, అశ్వత్థనాయుడు, నేలకోటభాస్కర్‌రెడ్డి, తిప్పేపల్లి వెంకటరాముడు, నరసింహులు, పోతుకుంటరవి, పోతలయ్య, చిట్రారామ్మోహన్, చిట్రానారాయణస్వామి ఉన్నారు.

కొత్తచెరువు: రా కదలిరా బహిరంగసభకు కొత్తచెరువు మండలం నుంచి టీడీపీ శ్రేణులు వందలాది వాహనాలలో తరలివెళ్లారు. తొలుత మండలకేంద్రంలో మాజీ మంత్రి పల్లె రఘునాథ రెడ్డి ఆధ్వర్యంలో ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం వివిధ వాహనాల్లో సభకు తరలివెళ్లారు.

ఓబుళదేవరచెరువు: మాజీ సీఎం చంద్రబాబు ఆధ్వర్యంలో చేపట్టిన రా.. కదలిరా.. సభకు మండలనుంచి వేలాదిమంది టీడీపీ శ్రేణులు తరలి వెళ్లారు. మాజీ మంత్రి పల్లె రఘునాథ రెడ్డి ఆధ్వర్యంలో ప్రత్యేక వాహనాల్లో వారంతా బయలుదేరి వెళ్లారు.

నల్లమాడ: చంద్రబాబు నిర్వహించిన రా... కదిలిరా.. సభకు మండలనుంచి టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులుభారీ సంఖ్యలో తరలివెళ్లారు. మాజీ మంత్రిపల్లె రఘునాథ రెడ్డి ఆధ్వర్యంలో దాదాపు వంద వాహనాల్లో వేలాదిమంది తరలి వెళ్లారు.

నంబులపూలకుంట: రా... కదలిరా.. సభకు మండలనుంచి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు నియోజకవర్గ ఇన్‌చార్జి కందికుంట వెంకటప్రసాద్ ఆధ్వర్యంలో పెద్దఎత్తున తరలివెళ్లారు. దాదాపుకు వందకు పైగా వాహనాల్లో బయలుదేరి వెళ్లారు.

కదిరిఅర్బన్: రా.... కదిలిరా... సభకు కదిరి పట్టణం నుంచి కందికుంట వెంకటప్రసాద్ ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు భారీగా తరలి వెళ్లారు. వందలాది వాహనాల్లో వేలాది మంది తరలి వెళ్లారు. సభకు వెళ్లేవారికోసం రూరల్ పరిధిలోని యాకాలచెరువుపల్లి వద్ద కందికుంట ఆధ్వర్యంలో భోజన సౌకర్యం కల్పించారు.

బుక్కపట్నం: చంద్రబాబు చేపట్టిన రా.... కదిలిరా... బహిరంగ సభకు మాజీ మంత్రి పల్లె రఘునాథ రెడ్డి ఆధ్వర్యంలో మండలానికి చెందిన టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు భారీగా తరలి వెళ్లారు. దాదాపు వంద వాహనాల్లో వారు బయలుదేరి వెళ్లారు.



కొత్తచెరువు మండల నాయకులు..



ఓడీసీ మండల పార్టీ శ్రేణులు



ఎన్‌పీకుంట మండల నాయకులు



బుక్కపట్నం మండల టీడీపీ శ్రేణులు

త్రోబాల్ ప్రీమియర్ లీగ్‌కు యశోద విద్యార్థుల ఎంపిక

ధర్మవరం, మార్చి 4: పట్టణంలోని యశోద పాఠశాల విద్యార్థులు గత నెల 8వ నుంచి 12వతేదీ వరకు ఢిల్లీలో జరిగిన త్రోబాల్ పోటీలలో ప్రతిభ కనబరచి త్రోబాల్ ప్రీమియర్ లీగ్‌కు ఎంపికైనట్టు పాఠశాల డైరెక్టర్ పృథ్వీరాజ్ తెలిపారు. తమ పాఠశాలలో 8వతరగతి చదువుతున్న నాగసాయిమిథి, 9వతరగతి చదువుతున్న మౌనిక, వైష్ణవి త్రోబాల్ ప్రీమియర్ లీగ్‌కు ఎంపికైనట్లు చెప్పారు. దీంతో ఆ విద్యార్థులను పాఠశాలలో సోమవారం డైరెక్టర్‌తోపాటు ప్రిన్సిపాల్ అనూప్, ఉపాధ్యాయులు అభినందించారు. ఈ విద్యార్థులు ఈనెల 11 నుంచి 15వతేదీ వరకు పశ్చిమబెంగాల్‌లో జరిగే త్రోబాల్ ప్రీమియర్ పోటీలలో పాల్గొననున్నట్లు పేర్కొన్నారు.

చంద్రమౌళీశ్వరస్వామికి ప్రత్యేక పూజలు



రజత కవచ అలంకరణలో స్వామి

మడకశిర టౌన్, మార్చి4: మాఘమాసం చివరి సోమవారం పట్టణంలోని దేవాలయల్లో ప్రత్యేక పూజ కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. చంద్రమౌళ్వీర స్వామికి ప్రత్యేకంగా రజత కవచ అలంకరణ చేశారు. అదేవిధంగా మిట్టబండ ఆంజనేయస్వామికి ఆకు పూజ చేశారు. అభయాంజనేయస్వామి, వీరభద్రేశ్వర, బోరామ లింగేశ్వర, కోట వెంకటేశ్వరస్వామి, షిర్డీసాయినాథుడు, మూలకంఠేశ్వరి, పూజమ్మదేవి తదితర ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. వెంకటేశ్వరస్వామికి ప్రాకారోత్సవం నిర్వహించారు. పూజ కార్యక్రమాల్లో పాల్గొన్న భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

రేపు జాబ్‌మేళా

హిందూపురం అర్బన్, మార్చి 4: ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ, ఎస్ఎస్‌వీఆర్ మహిళా డిగ్రీ కళాశాల సంయుక్తంగా బుధవారం జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ ప్రగతి సోమవారం ఓ ప్రకటన ద్వారా తెలిపారు. నాలుగు కంపెనీలతో జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పదో తరగతి పాస్ అయినవారు, ఇంటర్, డిప్లొమా, డిగ్రీ పూర్తి చేసిన నిరుద్యోగ యువతీ యువకులు ఇంటర్వ్యూలకు హాజరుకావాలన్నారు. అదే విధంగా 18 నుంచి 34 సంవత్సరాలు వయస్సు కలిగి ఉన్నవారు అర్హులన్నారు. ఇంటర్వ్యూలలో ఎంపికైన వారికి వా రి అర్హతను బట్టి నెలకు రూ.13వేల నుంచి రూ. 20 వేల వరకు జీతం ఉంటుందన్నారు. ఎంపికైన అభ్యర్థులు శ్రీసత్యసాయి జిల్లా, బెంగళూరులో ఉద్యోగం చేయవలసి ఉంటుందన్నారు. ఇంటర్వ్యూలకు హాజరయ్యే అభ్యర్థులు వారి బయోడెటాతో పాటు ఆధార్, విద్యార్హత సర్టిఫికెట్లతో ఉదయం 9 గంటలకు కళాశాల వద్దకు హాజరు కావాలన్నారు. నిరుద్యోగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ప్రిన్సిపాల్‌తో పాటు నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి అబ్దుల్ ఖయాం కోరారు. మరిన్ని వివరాలకు సెల్‌ఫోన్ నెం. 9966682246ను సంప్రదించాలన్నారు.

ఆలయ నిర్మాణానికి విరాళం

గోరంట్ల, మార్చి 4: మండలంలోని వానవోలు గ్రామంలో కస్తూరి రంగనాథస్వామి ఆలయ నిర్మాణానికి పెనుకొండకు చెందిన యశోదమ్మ, కొండారెడ్డి దంపతులు రూ.50,116 విరాళం సోమవారం అందించారు. అలాగే వానవోలుకు చెందిన కోడూరు లక్ష్మీనారాయణ, గుట్టిపల్లి నడిమద్దక లక్ష్మీనారాయణ, చిన్నమద్దక లక్ష్మీనరసప్ప, తిమ్మగానిపల్లి రంగస్వామి, శెట్టిచిన్నపల్లి సోముశేఖర్ రూ.10,116 చొప్పున కమిటీ సభ్యులకు విరాళం అందించారు. దాతలకు కమిటీ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

ఈవీఎంలపై సబ్ కలెక్టర్ అవగాహన

పెనుకొండ టౌన్, మార్చి 4 : త్వరలో జరుగనున్న ఎన్నికల దృష్ట్యా ఈవీఎంలపై సబ్ కలెక్టర్ అపూర్వ భరత్ అవగాహన కల్పించారు. స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో సోమవారం సెక్టారు, బూత్‌స్థాయి అధికారులతో సమావేశం నిర్వహించారు. 158అసెంబ్లీ నియోజకవర్గాలకు చెందిన అధికారులకు ఈవీఎంలపై అవగాహనతోపాటు సమస్యలను నివృత్తి చేశారు. ప్రతి ఒక్క బూత్‌స్థాయి అధికారులు ఈవీఎంలపై పూర్తిస్థాయి అవగాహన కల్పించారు.

పాఠశాల అన్యాక్రాంతంపై వినతి

పెనుకొండ రూరల్, మార్చి 4 : మండలంలోని కురుబవాండ్లపల్లి ప్రభుత్వ పాఠశాల అన్యాక్రాంతం అవుతోందని గ్రామానికి చెందిన కురుబ శివశంకర్‌నాయుడు సబ్‌కలెక్టర్‌కు సోమవారం వినతిపత్రం అందించారు. ప్రభుత్వ పాఠశాలకు సంబంధించిన ప్రహరీని గ్రామ సర్పంచ్ కూల్చి, పాఠశాల స్థలంలో నిర్మాణాలు చేపడుతున్నాడని ఆయన సబ్‌కలెక్టర్‌కు వివరించాడు. పాఠశాల అన్యాక్రాంతం కాకుండా చర్యలు తీసుకోవాలని కోరారు.

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన

చిలమత్తూరు, మార్చి 4: ఆర్థిక అక్షరాస్యతపై స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, నాబార్డు వారి సౌజన్యంతో సోమవారం మండలంలోని దేమకేతేపల్లి పంచాయతీలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా కళాకారులు పాటల రూపంలో స్టేట్ బ్యాంక్ ద్వారా ఖాతాదారు లకు అందే పథకాలు, బీమా, రుణాలు వంటి వాటిపై అవగాహన కల్పించారు. అదేవిధంగా సైబర్ నేరగాళ్ల బారిన పడకుండా ఎలా జాగ్రత్తలు తీసుకోవాలి అనే విషయాలపై వివరించారు. ఈ కార్యక్రమంలో బ్యాంకు మేనేజర్ ఫణిభూషణ్ కృష్ణ, ఎంవీ రూరల్ ఫోక్ ఆర్ట్ ఆర్గనైజేషన్ కళాజాతా బృందం మహేష్, రాఘవేంద్ర, ప్రజలు పాల్గొన్నారు.

కరాటేలో మడకశిర విద్యార్థుల ప్రతిభ



ప్రతిభ చూపిన విద్యార్థులతో ప్రిన్సిపాల్

మడకశిర రూరల్, మార్చి 4: మండలంలోని కదిరేపల్లి సెయింట్ ఆన్స్ ఉన్నత పాఠశాల విద్యార్థులు సోమవారం గుంతకల్‌లో నిర్వహించిన జిల్లా స్థాయి కరాటే పోటీల్లో అత్యంత ప్రతిభ కనబరచినట్లు పాఠశాల ప్రిన్సిపాల్ జోసఫిన్ లిల్లీ తెలిపారు. వారు రాయసీమ జోన్‌స్థాయి పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. రోజ్‌రాయ్ కరాటే అకాడమీ గుంతకల్ వారు నిర్వహించిన జిల్లా స్థాయి పోటీల్లో... పాఠశాలకు చెందిన శైలజ, జ్ఞానచైతన్య, హరిప్రియ , కుశలు, యమున, యశ్వంత్ గౌడ్ పాల్గొన్నారని తెలిపారు. అత్యంత ప్రతిభ కనబరచి జోనల్ స్థాయికి ఎంపికైనట్లు తెలిపారు. ఆ విద్యార్థులను ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు అభినందించారు.

తీవ్రమవుతున్న గ్రాసం కొరత

- కబేళాలకు తరలుతున్న పశువులు
- తగ్గుతున్న పాల దిగుబడి
- కుదేలవుతున్న పాడి పరిశ్రమ



దూర ప్రాంతం నుంచి గడ్డిని కొనుగోలు చేసి తీసుకొస్తున్న దృశ్యం

మడకశిర, మార్చి 4: జిల్లాలోని గ్రామీణ ప్రాంతాలో కరువు కరాళనృ త్యం చేస్తోంది. గతంలో ఎన్నడూ ఇలాంటి దుర్భర పరిస్థితి చూడలేదని వృద్ధులు పేర్కొంటున్నారు. గత సంవత్సరం వర్షాలు కురువక పోవడంతో భూగర్భజలాలు అడుగంటి బోర్లలో నీటిమట్టం బాగా తగ్గిపోయింది. దీంతో బోర్ల కింద పంటల సాగు విస్తీర్ణం తగ్గింది. వర్షాభావం వల్ల గత సంవత్సరం ఖరీఫ్‌లో సాగు చేసిన పంటలు దెబ్బతిన్నాయి. రబీలో అనుకుంత మేర పంటలు సాగుకాలేదు. దీంతో జిల్లాలో గ్రాసం కొరత రోజురోజుకు తీవ్రమవుతోంది. జిల్లాలో వ్యవసాయం తరువాత అధికంగా రైతులు పాడి పరిశ్రమపై ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. గ్రాసం కొరతతో పాటు దానా, ఆవుల ధరలు పెరగడంతో ప్రస్తుతం ఉన్న పాల ధరలు గిట్టు పాటు కావడం లేదని రైతులంటున్నారు. పాలధరలు పెంచాల్సిన అవసరం ఉందంటున్నారు. చెరువుల్లో నీరు అడుగంటి పోతుండడంతో వాటి పరిసరాల్లోని బోర్లు ఎండి పోతున్నాయి. దీంతో వాటి కింద సాగు విస్తీర్ణం బాగా తగ్గి, పశువులకు గ్రాసం సమకూర్చడానికి రైతులు పడుతున్న ఇబ్బందులు వర్ణనాతం. తీవ్ర వర్షాభావ పరిస్థితుల కారణంగా జిల్లాలో ఇప్పటికే 21 మండలాలను కరువు ప్రాంతాలుగా ప్రకటించా రు. అందులో తీవ్ర కరువు మండలాలు ఏడుకాగా మిగిలిన 41 మం డలాలు తీవ్రత తక్కువగా ఉన్నవి. గత యేడు పంటలు దెబ్బతిని గ్రాసం కొరత తీవ్రం కావడంతో ప్రభుత్వం జిల్లాలో మూడు చోట్ల గడ్డి కేంద్రాలను ఏర్పా టుచేసింది. పశువులకు గ్రాసాన్ని సరఫరా చేసింది. ఈ యేడు గ్రాసం కొరత అంత కంటే ఎక్కువగా ఉందని, గడ్డి కేంద్రాలను ఏర్పాటుచేయాలని రైతులు వి జ్ఞప్తి చేస్తున్నారు. జిల్లాలో 23 మండలాల్లో ఇప్పటికే గ్రాసం కొరత తీవ్రంగా ఉన్నట్లు అధికారులు గుర్తించారు. ప్రత్యామ్నాయ ఏర్పాట్ల కోసం ఉన్నతాధి కారులకు ప్రతిపాదనలు పంపినట్లు సంబంధిత శాఖాధికారుల సమాచారం. కరువు బృందం జిల్లాలో పర్యటించినప్పుడు గ్రాసం కొరతపై తయారు చేసిన నివేదికను అందజేశారు.

జిల్లాలో 3.26లక్షల పశువులు

జిల్లాలో 3.26 లక్షలు పాడి పశువులు ఉన్నాయి. అందులో 2.50 లక్షల ఆవులు , 80వేల దాకా గేదెలు ఉన్నాయి. మేకలు, గొర్రెలు 31 లక్షల దాకా ఉన్నాయి. పశువులకు సంబంధించి జిల్లాకు 633 మెట్రిక్ టన్నుల గడ్డి అవసరం ఉంది. ఖరీఫ్ ప్రారంభం నుంచి వర్షాలు కురవక పోవడం పంటలు ఎండి పోతుండడంతో రైతులు మధ్యలోనే పంటను తొలిగించారు. దీనికి తోడు రబీ సాగు తగ్గడంతో గ్రాసం కొరత తీవ్రం రూపం దాల్చింది. దీంతో గడ్డి ధరలు విపరీతంగా పెరిగాయి. ట్రాక్టర్ గడ్డి రూ. 12వేల నుంచి రూ. 15 వేల దాకా పలుకుతోంది. గతంలో ఎన్నడు లేని విధంగా ఈ సంవత్సరం గడ్డి కొరత తీవ్రంగా ఉందని రైతులు అంటున్నారు. గతంలో మాదిరి గా గడ్డి కేంద్రాలు ఏర్పాటు చేసి ఉచితంగా గడ్డిని అందించాలని కోరుతున్నారు. పదేళ్ల కిందటి పరిస్థితులు నెలకొన్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పలు గ్రామాల్లో పశువులకు తాగు నీటి సౌకర్యం లేకపోవడంతో మరింత ఇబ్బందులు పడుతున్నామన్నారు. గడ్డి కొరత వల్ల పాలిస్తే పశువులను కూడా కబేళాలకు తరలించాల్సి వస్తోందని కంటతడిపెడుతున్నారు.

గిట్టుబాటు కాని పాల ధరలు

ట్రాక్టర్ గడ్డి రూ.12వేల నుంచి రూ.15వేల వరకు ఉందని, అంత డబ్బు పెట్టి కొనుగోలుచేయలేకపోతున్నామని పలువురు రైతులు పేర్కొంటున్నారు. పశువులకు గ్రాసం సక్రమంగా వేయకపోవడం వలన పాల దిగుబడి తగ్గుతోందంటున్నారు. ప్రస్తుతం దానాతో పాటు గడ్డి ధరలు పెరగాయని, కావున ప్రస్తుతం ఉన్న పాలధరలు గిట్టుపాటు కావడం లేదంటున్నారు. ఆవుపాలు లీటరు ధర రూ.35 నుంచి రూ.45 దాకా ఉంది. వెన్నశాతం బట్టి పాలధర ఇస్తున్నారు. ప్రస్తుతం పరిస్థితులలో వెన్నశాతం సరిగా రావడం లేదని, వెన్న శాతంతో నిమ్మిత్తం లేకుండా లీటరు పాలను రూ.50తో కొనగోలు చేయాలని రైతులు కోరుతున్నారు.

గ్రాసం కొరతతో ఇబ్బందులు పడుతున్నాం



గత యేడాది వేరుశనగ పంట దెబ్బతింది. కనీసం పశుగ్రాసమైన దక్కుతుందనుకుంటే.... వర్షం లేకపోవడంతో పంట పోయింది. దీంతో పశువులకు మేతలేక ఇబ్బందులు పడుతున్నాం. నాకు ఒక గేదే, ఆవు , మేకలున్నాయి. ఒక మోపు గడ్డికి రూ.300 ఇచ్చి కొనుగోలుచేస్తున్నాం. ప్రభుత్వం స్పందించి పశుగ్రాసం సరఫరాచేయాలి. **- చిత్రశేఖర్, రైతు, వస గొల్లహట్టి**

గడ్డి కేంద్రాలు ఏర్పాటు చేయాలి

పశుగ్రాసం కొరత తీవ్రంగా ఉంది. బయట మార్కెట్‌లో ట్రాక్టరు లోడు గడ్డి రూ.12వేలు దాకా ఉంది. కొందమంటే అది కూడా సరిగా దొరకడం లేదు. దూర ప్రాంతాలకు వెళ్లి కొనగోలు చేయాల్సి ఉంది. ఎక్కడ కాసంత గడ్డి ఉన్నా అక్కడికి పశువులను తోలుకెళ్తున్నాం. నాకు 20 వరకు పశువులున్నాయి. వాటికి గడ్డి సమకూర్చ లేక పోతున్నాం. ఇప్పటికైనా సంబంధిత శాఖ అధికారులు స్పందించి గడ్డి కేంద్రాలను ఏర్పాటుచేసి పశుగ్రాసాన్ని పంపిణీ చేయాలి. లేకపోతే సబ్సిడీతోనైనా గడ్డిని పంపిణీ చేయాలి. **- హనుమంతరాయప్ప, రైతు, అగళి**



గ్రాసం కొరతతో సంతకు వచ్చిన పశువులు

పరీక్షల వేళ విద్యుత్ కోతలు

ఇబ్బందులు పడుతున్న విద్యార్థులు



విద్యుత్ కోతతో నానెప్పనగర్ ఇలా...

హిందూపురం అర్బన్, మార్చి 4: ఎడాపెడ విద్యుత్ కోతలతో విద్యార్థులు సతమతమవుతున్నారు. పరీక్షల వేళ కాబట్టి విద్యార్థులు సమయం వృధా చేయకుండా చదువుపై శ్రద్ధపెట్టాల్సి వస్తుంది. ఇలాంటి సమ యంలో విద్యుత్ కోతలతో వారు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. హిందూపురం శ్రీకంఠపురం ఫీడర్‌లో సోమవారం సాయంత్రం నుంచి ఐదు మార్లు విద్యుత్ సరఫరా నిచిపోయింది. గంటల కొద్దీ విద్యుత్ లేకపోవడంతో విద్యార్థులు అయోమయంలో పడ్డారు. పరీక్షల్లో మార్కులు తక్కువగా వచ్చినా, పరీక్షలు తప్పినా అందుకు విద్యుత్ శాఖదే బాధ్యత అని విద్యార్థులు, వారి తల్లితండ్రులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పట్టణంలోని రైల్వే గేటు కింద శ్రీకంఠపురం, నానెప్పనగర్ తదితర ప్రాంతాలకు శ్రీకంఠపురం సబ్ స్టేషన్ ఉన్నా తూమకుంట నుంచి విద్యుత్ సరఫరా అవుతుంది. దీంతో విద్యుత్ సరఫరాకి తరచూ ఇబ్బందులు కలుగుతున్నాయి. కొన్నేళ్ల నుంచి ఈ సమస్యను పరిష్కరిస్తామని విద్యుత్ అధికారులు చెబుతున్నారు. కానీ ఎంత మంది ఈఈలు మారినా సమస్య ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ఉంది. శ్రీకంఠపురంలో సోమవారం విద్యుత్ సరఫరాలో జరిగిన అంతరాయానికి ఆ శాఖ అధికారులను కారణం అడిగితే తూ మకుంటలో ట్రిప్ అయిందని అంటున్నారు. సాధారణంగా వర్షా కాలంలో లేదా గాలి ఎక్కువగా ఉంటేనో ట్రిప్ అవుతుంది. కానీ వేసవిలో కూడా ఇలా ట్రిప్ అవడమేంటని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. దీన్ని బట్టి చూస్తే విద్యుత్ సరఫరాలో ఎంత నాణ్యత ఉందో అర్థం చేసుకోవచ్చు. స్వయానా ఆ శాఖ మంత్రి పెద్ది రెడ్డి రామచంద్రారెడ్డి అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకొన్న హిందూ పురంలో ఇలా నాణ్యత లేని విద్యుత్‌తో ప్రజలు ఇబ్బందులు పడుతున్న సంగతి ఆయనకు తెలియదేమో అని ప్రజలు చర్చించుకుంటున్నారు.

తూమకుంట 33 కేవీలో సమస్య

తూమకుంట పారిశ్రామిక వాడలో 33 కేవీలో సమస్య ఉత్పన్నమైంది. అందువల్ల హిందూపురంలోని కొన్ని ప్రాంతాలకు సరఫరాలో అంతరాయం ఏర్పడింది. సక్రమంగా సరఫరా అందించే పనిలో సిబ్బంది నిమగ్నమయ్యారు. ఆర్‌టీసీ ఫీడర్ నుంచి బ్యాక్ ఫీడ్ తీసుకుని విద్యుత్ అందిస్తున్నాం. కానీ అధిక లోడు కారణంగా ఫీజలు నిలబడటం లేదు. ట్రిప్ అవుతోంది.

- భూపతి, ఈఈ, విద్యుత్ శాఖ



కొవ్వొత్తుల వెలుగులో చదువుకుంటున్న విద్యార్థులు

రా...కదలిరా...కు తరలివెళ్లిన నాయకులు

(ఆంధ్రజ్యోతి, న్యూస్‌నెట్‌వర్క్)

టీడీపీ అధినేత చంద్రబాబు ఆధ్వర్యంలో పెనుకొండలో నిర్వహించనున్న రా.. కదలి..రా మహా సభకు హిందూపురం నుంచి తెలుగు తమ్ముళ్లు భారీగా తరలి వెళ్లారు. అలాగే చిలమత్తూరు, లేపాక్షి, హిందూపురం రూరల్ , అగళి మండలాల నుంచి కూడా భారీగా తరలి వెళ్లారు. బస్సులు, కార్లు దాదాపు 500 వాహనాల్లో బయలుదేరారు. దాదాపు 5 కిలో మీటర్లమేర వాహనాలు క్యూ కట్టాయి. పురం పసుమయమైంది. లేపాక్షి మండలం నాయకులు కారుపైన సైకిల్ ఎక్కించి అభిమానం చాటుకున్నారు.



పురం నుంచి బాబు సభకు వెళ్తున్న మహిళలు



సోమఘట్ట నుంచి తరలివెళుతున్న చిలమత్తూరు శ్రేణులు



బైక్ ర్యాలీగా వెళ్తున్న సోమందేపల్లి టీడీపీ కార్యకర్తలు

కలెక్టరేట్‌లో స్పందనకు 187 వినతులు

పుట్టపర్తి, మార్చి 4: జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమానికి 187 వినతిపత్రాలు అందాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల ప్రజలు కలెక్టరేట్‌కు విచ్చేసి పలు సమస్యల పరిష్కారం కోరుతూ ఈ వినతులను అందించారు. వాటిని జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్ స్వీకరించి పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ స్పందనలో ప్రజలు వినతుల ద్వారా తెలిపిన సమస్యల్ని వెంటనే పరిష్కరించాలని ఆయా అధికారులను ఆదేశించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ ఆలస్యం చేయరాదన్నారు. పంట నష్ట పరిహారం ఇప్పించాలంటూ కొత్తచెరువుకు చెందిన రామాంజినేయులు వినతి పత్రం ఇచ్చారు. అలాగే కదిరి మున్సిపాలిటీ పరిధిలోని మెహర్‌నగర్‌లో ఉన్న తమ ఇల్లు లేఅవుట్ వేయడంతో ధ్వంసమైందని ప్రత్యామ్నాయంగా మరో ఇల్లు మంజూరు చేయాలంటూ దిల్షాద్ కోరారు. రోడ్డు విస్తరణలో తమ ఇల్లు నష్టపోయానని తనకు న్యాయం చేయాలంటూ ఓడీసీ మండలం అల్లాపల్లి గ్రామానికి చెందిన వరలక్ష్మి వినతి చేశారు. ఇలా వివిధ సమస్యలను పరిష్కరించాలంటూ ప్రజలు వినతులు అందించారు. కార్యక్రమంలో డీఆర్వో కొండయ్య, డీఆర్‌డీఏ పీడీ నరసయ్య, నోడల్ అధికారి శివారెడ్డి, డీపీఓ విజయ్‌కుమార్, ఆర్డీఓ భాగ్యరేఖ, తదితరులు పాల్గొన్నారు.

పోలీస్ స్పందనకు 22 వినతులు

పుట్టపర్తి రూరల్: జిల్లాకేంద్రంలోని పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన స్పందనకు 22 వినతిపత్రాలు అందాయి. జిల్లాలోని పలు ప్రాంతాల ప్రజలు వివిధ సమస్యల పరిష్కారం కోరుతూ వాటిని అందజేశారు. ఎస్పీ మాధవ రెడ్డి వాటిని స్వీకరించారు. అనంతరం మాట్లాడుతూ చట్టపరిధిలో ఉన్న ప్రజల సమస్యలను వెంటనే పరిష్కరించాలని పోలీసు అధికారులకు సూచించారు. స్పందనలో తెలిపిన సమస్యల్ని మొదటి ప్రాధాన్యతమిస్తామన్నారు. ఎక్కువగా రస్తావివాదాలు, కుటుంబకలహాలు, భూవివిదాలు, అర్థిక మోసాలకు సంబంధించిన ఫిర్యాదులు ఎక్కువగా ఉన్నా యి. దిశ డీఎస్పీ శ్రీనివాసరావు, డీసీఆర్బీ సీఐ శ్రీహర్ష, లీగల్ అడ్వైజర్ విశ్వనాథరెడ్డి సిబ్బంది పాల్గొన్నారు.

పలు గ్రామాల్లో తాగునీటి ఎద్దడి

- పట్టించుకోని అధికారులు, నాయకులు
- ఇబ్బందుల్లో ప్రజలు





వ్యవసాయ బోర్ల వద్ద నుంచి తాగునీటిని తెచ్చుకుంటున్న నీలకంఠాపురం ఎస్సీ కాలనీ మహిళలు, వృద్ధులు

మడకశిర రూరల్, మార్చి 4: వేసవి ప్రారంభంలోనే మండలంలోని గ్రామాల్లో రోజు రోజుకు తాగునీటి ఎద్దడి తీవ్రమవుతోంది. అయితే అధికారులు, నాయకులు పట్టించుకోవడం లేదని ఆయా గ్రామస్తులు వాపోతున్నారు. మండలంలోని నీలకంఠాపురం, దాసప్పపాళ్యం, కదిరేపల్లి, కంబాలపల్లి, మైబీహళ్లి, కోడిగానిపల్లి, టీడీపల్లి, డీ రామగిరి, అచ్చంపల్లి, యూ రంగాపురం గ్రామాల్లో తాగునీటి ఎద్దడి తీవ్రంగా నెలకొంది. గత సంవత్సరం తీవ్ర వర్షాభావ పరిస్థితుల కారణంగా మండలంలో భూగర్భ జలమట్టం బాగా తగ్గిపోయింది. దీంతో చాలా గ్రామాల్లోని తాగునీటి బోర్లలో నీరు అడుగంటి పైకి రావడంలేదు. కొన్ని గ్రామాల్లో బోర్లు పూర్తిగా ఎండిపోయాయి. మరికొన్ని బోర్లలో నీరు అరకొరగా వస్తోంది. బిందెడు నీటి కోసం గ్రామీణ ప్రజలు గంటల కొద్దీ నిరీక్షణ చేయాల్సి వస్తోంది. నీలకంఠాపురంలో ఉన్న నాలుగు బోర్లలో నీటి మట్టం అడుగంటిపోయింది. దీంతో గ్రామంలోని మహిళలు, వృద్ధులు తాగునీటి కోసం సమీప వ్యవసాయబోర్ల వద్దకు వెళ్లి అవస్థలు పడి తెచ్చుకుంటున్నారు. అధికారులు స్పందించి గ్రామాల్లో తాగునీటి సమస్య పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు. దీనిపై మండల ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ మహేశ్వర్‌రెడ్డిని వివరణ కోరగా... తాగునీటి ఎద్దడి ఉన్న గ్రామాల్లో వారంలోగా బోర్లు వేయించి నీటి సమస్య పరిష్కరించనున్నట్లు తెలిపారు.

పోలింగ్ కేంద్రాలు ఓటర్లకు అనుకూలంగా ఉండాలి

అధికారులకు జేసీ అభిషేక్ కుమార్ సూచన



హుసేన్‌పురంలో పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న జేసీ

చిలమత్తూరు, మార్చి 4: ఓటర్లకు అనుకూలంగా పోలింగ్ బూత్‌లను ఏర్పాటు చేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్ స్థానిక అధికారులకు సూచించారు. ఆయన సోమవారం మండలంలోని వీరాపురం పంచాయతీలో పలు పోలింగ్ బూత్‌లను తనిఖీ చేశారు. పోలింగ్ బూత్‌లలో వసతుల గురించి స్థానిక అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రతి ఓటరు ఓటు హక్కు వినియోగించుకునేలా ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. ఓటరు జాబితా ప్రకారం అందరికీ వారి వారి ప్రాంతాలలో అనుకూలంగా పోలింగ్ బూత్‌లు ఉండే విధంగా చూసుకో వాలన్నారు. డబుల్ ఎంట్రీ ఓట్లు, మృతిచెందిన వారి ఓట్లు, బోగస్ ఓట్లు వంటి వాటిపై ఎప్పటికప్పుడు విచారణ చేపట్టి వెంటనే వాటిని జాబితాల నుంచి తొలగించాలన్నారు. అర్హత కలిగిన వారికి ఓటు హక్కు కల్పించడంలో నిర్లక్ష్యం వహిస్తే సంబంధిత అధికారులతో పాటు బీఎల్‌ఓలపై చ ర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం ఇంటింటికి రేషన్ సరఫరా చేసే ఎండీయూ వాహనాలను తనిఖీ చేశారు. రేషన్ కార్డు దారులకు ఇబ్బంది లేకుండా రేషన్ సరఫరా చేయాలన్నారు. తూనికలు సక్రమంగా ఇస్తూ ప్రతి కుటుంబానికి సకాలంలో రేషన్ చేర్చాలన్నారు.

'దురలవాట్లను విడనాడాలి'



గ్రామంలో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

గోరంట్ల, మార్చి 4: దురలవాట్లు విడనాడాలంటూ మండలంలోని కసిరెడ్డిపల్లి లో ఏఎన్‌కె డిగ్రీ కళాశాల విద్యార్థులు సోమవారం అవగాహన కల్పించారు. ఎన్ఎస్ఎస్ ప్రత్యేక శిబిరంలో భాగంగా కళాశాల విద్యార్థులు ప్లకార్డులతో గ్రామంలో ప్రదర్శన చేశారు. గుట్కా, గంజాయి, మద్యం, మట్కా, జూదం లాంటి వ్యసనాలకు బానిసలు కాకూడదని పిలుపునిచ్చారు. బానిసైలనవారు బంగారు భవిష్యత్‌ను బుగ్గిపాలు చేసుకుంటున్న విషయాన్ని గుర్తించాల న్నారు. తాము చెడిపోవడమేకాకుండా పిల్లల భవిష్యత్‌ను అంధకారం చేస్తున్నారని తెలిపారు. వాటికి దూరంగా ఉంటూ సుఖమయ జీవితం గడపాలని కోరారు. ఓటు హక్కు ప్రాముఖ్యతను వివరించారు. వివిధ పార్టీల వారు ఇచ్చే కానుకలకు ఓటును అమ్ముకుంటే, ఐదేళ్ల బానిసన పాలనలో మగ్గాల్సి ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ పీఓ ఆదినారాయణరెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులున్నారు.

రైతులకు 9 గంటల విద్యుత్ అందించాలి

రైతుకూలీ సంఘం నాయకుల డిమాండ్

హిందూపురం అర్బన్, మార్చి 4: రైతులకు తొమ్మిది గంటల సేపు నాణ్యమైన విద్యుత్ అందించాలని అఖిల భారత రైతు వ్యవసాయ కూలీ సంఘం నాయకులు రంగనాయకులు తదితరులు డిమాండ్ చేశారు. వారు సోమవారం పరిగి మండల కేంద్రంలో రైతులతో కలిసి నిరసన తెలిపారు. అనంతరం డిప్యూటీ తహసీల్దార్ లక్ష్మీనరసింహకు వినతి అందించారు. రైతులకు 9 గంటల నాణ్యమైన విద్యుత్ అందిస్తామని చెప్పిన వైసీపీ ప్రభుత్వం ఇప్పుడు రెండు గంటలు కోత విధించి 7 గంటలే ఇస్తోందన్నారు. అందులోను కోతలు విధిస్తే రైతులు ఏమైపోవాలని ఆగ్రహించారు. వేసవి కావడంతో ఎండ తీవ్రత ఎక్కువగా ఉందన్నారు. పంటలకు సక్రమంగా నీరు అందకపోతే పంటలు ఎండిపోయి రైతులు నష్టాల్లో కూరుకుపోతున్నారని ఆగ్రహించారు. తొమ్మిది గంటల నాణ్యమైన విద్యుత్ అందించడమే కాకుండా వ్యవసాయ బోర్లకు స్మార్ట్ మీటర్లు బిగించడం ఆపాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో శంకరప్ప, జీ శంకరప్ప, నరేష్, చలపతి రైతులు పాల్గొన్నారు.

రక్షణ గోడలు నిర్మించండి : బీఎస్పీ

హిందూపురం అర్బన్, మార్చి 4:

స్థానిక హిందూపురం - మడకశిర ప్రధాన రహదారిలో మోతుకపల్లి బ్రిడ్జి వద్ద ఉన్న ప్రమాదకర మలుపునకు రక్షణ గోడలు ఏర్పాటు చేయకపోతే ఉద్యమం చేస్తామని బహుజన సమాద్‌వాదీ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు శ్రీరాములు పేర్కొన్నారు. ఈ మేరకు సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద డిప్యూటీ తహసీల్దార్ వెంకటేశ్వర్లుకు వినతి అందించారు. ఈ సందర్భంగా బీఎస్పీ నాయకులు మాట్లాడు తూ... ఇటీవల శిథిలావస్థలో ఉన్న మోతుకపల్లి బ్రిడ్జి పక్కనే నూతన బ్రిడ్జి ఏర్పాటు చేశారు కానీ బ్రిడ్జి దాటే సమయంలో ఉన్న ప్రమాదకర మలుపు వద్ద రక్షణగోడలు ఏర్పాటు చేయలేద న్నారు. ఈ విషయంపై ఇంతకు ముందే బ్రిడ్జి వద్ద నిరసన చేపట్టామన్నారు. కానీ అధికారులు ఏమాత్రం పట్టించుకోకుండా నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆగ్రహించారు. ఏదైనా ప్రమాదం జరిగితే కానీ స్పందించరా అని ప్రశ్నించారు. ఇలాగే కొనసాగితే బీఎస్పీ ఆధ్వర్యంలో అందరినీ కలుపుకొని పెద్ద ఎత్తున ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీఎస్పీ నియోజకవర్గ అధ్యక్షుడు నాజీమ్‌బాష, ఉపాధ్యక్షుడు సుబ్బరాయప్ప, పట్టణాధ్యక్షుడు దాసరి ఈశ్వరయ్య, నాయకులు పెన్నయ్య, మౌలాలి, బాబు, చంద్రశేఖర్, ఖలందర్, రవికుమార్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

మార్చి 7న వంధ్యత్వ పరీక్షా శిబిరం

హిందూపురం: వివాహమై, చాలా ఏళ్లయినా సంతానం కలగలేదా? అలా అయితే, ఇదిగో మీలాంటి దంపతులకు ఒక సువర్ణావకాశం. బెంగళూరులోని ప్రఖ్యాత గుణశీల ఫెర్టిలిటీ సెంటర్ మార్చి 7 (గురువారం) సంతానలేమి (వంధ్యత్వం)తో బాధపడుతున్న మహిళల కోసం హిందూపూర్‌లోని బీఎం మార్కెట్‌లోని ముబారక్ క్లినిక్‌లో ఉచిత స్కానింగ్, చెకప్ క్యాంపును నిర్వహిస్తోంది. ఈ పరీక్ష శిబిరం ఆ రోజు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు కొనసాగుతుంది. ఉచిత వైద్య పరీక్ష శిబిరంలో పాల్గొనే దంపతులు తమ పేర్లను ముందస్తుగా నమోదు చేసుకోవాలి. ఫోన్: **080-46462600 లేదా 8019876526, 9550157212.**